వీక్షణం

Veekshanam

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 9 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | మార్చి 16-31, 2004

లోపలి పేజీల్లో...

విడి ప్రతి : రు॥ 6/-
వార్షిక చందా : రూ॥140/-లు

సంపాదకీయం:

నిచ్చెన మార్పిడి రాజకీయాలు!

భారత రాజకీయాల్లో 1960లలో ప్రారంభమైన 'ఆయారాం గయారాం' సంస్కృతి ఇప్పటికి వటవృక్షమై విస్తరించి కుక్కమూతి పిందెలు వేస్తున్నట్టుంది. పార్టీల మార్పిడి నిషేధ చట్టం అమలు జరుగుతూ వస్తున్నా, పార్టీ ఫిరాయింపుల పట్ల సాధారణ జనాభిప్రాయం అసహ్యాన్ని వ్యక్తం చేస్తున్నా, రాజకీయ నాయకుల ఊసరవెల్లి లక్షణం తగ్గిపోవడం లేదు. ఈ ఎన్నికల సందర్భంగా ఆయా రాజకీయ నాయకులు ఎంత సునాయసంగా పార్టీలు ఫిరాయిస్తున్నారో చూస్తే ఊసరవెల్లులే సిగ్గుతో తలదించుకుంటాయి కాబోలు! రాజకీయ నాయకులైనంత మాత్రాన అభిప్రాయాలు మారకూడదనో పార్టీలు మార్చకూడదనో కాదు, ఆ మాటకొస్తే దేశంలోని చాలా పార్టీలు కాంగ్రెసు నుంచి బయటకు వచ్చిన వాళ్ళు ఏర్పాటు చేసినవే. కానీ రాజకీయాభిప్రాయాలు వేరైనప్పుడో, ఒక ప్రత్యేకమైన సందర్భంలో భిన్నమైన వైఖరులు తీసుకున్నప్పుడో పార్టీలు మార్చడాన్ని అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల సందర్భంలో ఒక పార్టీ టికెట్ కోసం ఎంతగానో ప్రయత్నించి భంగపడి మరో పార్టీ టికెట్‌నాశించి ఆ పార్టీలోకి దూకడం ఆ రాజకీయ నాయకులకు, వారిని చేర్చుకుంటున్న పార్టీలకు, మొత్తంగా రాజకీయ వ్యవస్థకే అవమానం. ఇంత సులభంగా పార్టీల మార్పిడి జరిగిపోతున్నదంటే ఇందుకు రెండు కారణాలుండి ఉండాలి. ఒకటి పైకి ఎంత తీవ్రంగా వ్యతిరేకించుకున్నా ఎన్నెన్ని నిందలు, ఆరోపణలు గుప్పించుకున్నా, సారాంశంలో అన్ని పార్టీలు ఒక్కటే అనే దానికి ఈ పార్టీల ఫిరాయింపులే నిదర్శనం. ఇలా రంగులు మార్చనిస్తున్న పార్టీల రాజకీయ వైఖరులలో దృక్పథాలలో ఏమీ తేడాలేదన్నమాట. కొన్ని దశాబ్దాలపాటు ఒక పార్టీలో కార్యకర్తగా మాత్రమేకాదు నాయకులుగా, ప్రతినిధిగా వ్యవహరించిన వ్యక్తి మర్నాటికల్లా ఆ పార్టీకి భిన్నంగా కనబడే మరో పార్టీలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇమిడిపోగలగడం భారత రాజకీయాల్లో కొనసాగుతున్న కుహనా వ్యతిరేకతలకు అద్దంపడుతుంది. రెండు, ఈ రాజకీయ నాయకులందరికీ నిజంగా రాజకీయాలకు అర్థం ఏమిటో తెలియదన్నమాట. 'రాజకీయాలంటే ప్రజాసమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు వెతికే ఒక ప్రక్రియ' అని వీళ్లెవరూ అర్థం చేసుకోవడం లేదన్నమాట. రాజకీయాలంటే కేవలం పదవిని కట్టబెట్టేవిగా, అధికారాన్ని ఇచ్చేవిగా, ఇబ్బడి ముబ్బడిగా డబ్బు సంపాదించడానికి వనరులు సమకూర్చిపెట్టేవిగా మాత్రమే వీళ్ళు చూస్తున్నారన్నమాట. అంటే వీళ్ల దృష్టిలో రాజకీయాలు కేవలం తమ స్వప్రయోజనాలకు నిచ్చెనలలాంటివి. గద్దెనెక్కడమే పరమావధి అయినపుడు నిచ్చెనెటువంటివదనే ప్రశ్న రాదు. నిచ్చెనలను మార్చడం సులభం అవుతుంది కాని ఆ నిచ్చెనల క్రింద నలిగిపోతున్న కోట్లాది ప్రజల ఆర్తనాదాలు హాహాకారాలు ఒక రోజున ప్రతిఘటనగా పరిణమిస్తాయి. అప్పుడు అన్ని నిచ్చెనలు కూలిపోతాయి!

○

రాష్ట్రంలో వ్యవసాయం మీద ప్రభుత్వ పెట్టుబడులు

(ఏడాదికి కోట్ల రూ.)

అంశం	5వ ప్రణాళిక 1974-75 నుంచి 1978-79	6వ ప్రణాళిక 1980-81 నుంచి 1984-85	7వ ప్రణాళిక 1985-86 నుంచి 1989-90	1990-91 మరియు 1991-92	8వ ప్రణాళిక 1992-93 1996-97
1. వ్యవసాయం, తత్సంబంధిత రంగాలపై పెట్టుబడి ఖర్చు (ప్రస్తుత ధరల్లో)	124	212	339	372	795
2. వ్యవసాయం, తత్సంబంధిత రంగాలపై పెట్టుబడి ఖర్చు (1980-81 స్థిరధరల్లో)	202	162	151	125	181
3. హెక్టారు నికర పంట భూమిపై పెట్టుబడి ఖర్చు (80-81 ధరల ప్రకారం)	182	147	142	113	174
4. నికర స్థూల రాష్ట్రాదాయంలో వ్యవసాయం వాటాలో పెట్టుబడి ఖర్చు శాతం (ప్రస్తుత ధరల్లో)	5.58	5.15	5.23	3.01	4.19
5. మొత్తం నికర స్థూల రాష్ట్రాదాయంలో పెట్టుబడి ఖర్చు (ప్రస్తుత ధరల్లో)	2.61	2.15	1.83	1.09	1.39
6. వ్యవసాయం మీద అఖిల భారత పెట్టుబడి ఖర్చులో ఆంధ్రప్రదేశ్ వాటా (శాతం)	4.78	4.43	5.52	4.72	6.65
7. రాష్ట్రాల్లో మన ర్యాంకు	5	6	5	5	4

_ఆధారం:_ రమేష్‌చంద్, నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ ఎకనామిక్స్ అండ్ పాలసీ రీసెర్చి, న్యూఢిల్లీ

నికర రాష్ట్రాదాయంలో పెట్టుబడుల వాటా

సంవత్సరం	వ్యవసాయం	ప్రాథమికరంగం	తయారీరంగం	ద్వితీయరంగం	తృతీయరంగం	అన్నిరంగాలు
1982-83	21.2	7.4	30.0	38.7	31.5	21.7
1983-84	18.8	7.5	30.5	46.6	27.2	21.6
1984-85	21.2	8.6	33.5	52.3	28.8	24.1
1985-86	22.8	9.5	35.0	50.5	30.6	25.2
1986-87	29.2	11.6	39.3	44.0	32.1	26.2
1987-88	30.9	12.1	39.8	44.2	30.5	26.1
1988-89	29.9	11.6	39.3	44.3	27.2	24.3
1989-90	24.0	10.5	34.7	51.5	25.4	24.5
1990-91	19.3	10.1	29.7	58.7	24.5	25.9
1991-92	16.9	9.6	25.9	64.9	23.9	27.1
1992-93	16.7	9.4	25.4	62.1	25.3	27.0
1993-94	16.7	8.6	24.7	61.2	26.0	26.3
1994-95	15.3	8.4	24.5	54.5	26.2	25.0
1995-96	13.2	7.3	20.9	54.7	24.9	24.3
1996-97	11.5	6.6	18.3	55.5	23.7	23.8
1997-98	11.2	6.4	16.7	57.2	22.9	24.0
1998-99	12.0	6.5	17.9	54.2	22.0	22.9
1999-00	13.9	7.1	20.1	52.0	22.1	22.8

ఆపద్ధర్మ ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలి

రాజ్యాంగవరంగా అయితే నిన్నా, మొన్నా ఎన్నికలొచ్చాయి గాని, చంద్రబాబు పాలనలో గత సంవత్సరం మే నెలలో తిరుపతి సమావేశంలో కోటివరాల ప్రకటనతోనే ప్రారంభమయ్యాయి. శాసనసభను రద్దుచేయకముందు, చేసిన తర్వాత మరో మూడు విడతలుగా వరాల ప్రకటనలొచ్చాయి. అక్కడ కేంద్రంలో కూడా వాగ్దానాల జల్లులు కురిపించారు. ఇవి రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకొని, అధికార దుర్వినియోగం చేసి, వోటర్లను ప్రభావితం చేయుటవే లక్ష్యమనేది నిర్వివాదాంశం. చట్టపరంగా ఈ ప్రకటనలు సమ్మతమైనవే కావచ్చు. ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయాలకు అభ్యంతరం చెప్పలేకపోవచ్చు. అలాగని ఈ అనైతిక ప్రవర్తన కొనసాగాల్సిందేనా? చట్టప్రకారంగా గాని, ఆనవాయితీగా గాని, అధికారంలో వున్న పార్టీనే ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగించటం జరుగుతూంది. ఆవిధంగా అధికార దుర్వినియోగానికి ఆస్కారమేర్పడుతుంది. ఎన్నికల విషయాలను అధ్యయనం చేసేవారు, రాజకీయ పార్టీలు ఇలా దుర్వినియోగం చేయడానికి వీలులేని విధానాన్ని గురించి ఆలోచించాలి. రెండు ఆలోచనలున్నాయి. 1) ఆపద్ధర్మ ప్రభుత్వం వోటర్లను ప్రభావితం చేసే నిర్ణయాలేమీ చేయకూడదు; 2) అధ్యక్ష పాలక విధించాలి. అయితే అధ్యక్షపాలన విధించటం అంటే రాష్ట్రపతి ప్రతినిధిగా గవర్నరే పరిపాలన సాగిస్తాడు. ఇవాళా, రేపూ పాలన పార్టీలో పదవులు దొరకనివారికి, ఎన్నికల్లో ఓడిపోయిన వారికి, తమ పార్టీ అనుయాయులకే గవర్నరు పదవులు కట్టబెడుతున్న పరిస్థితుల్లో, గవర్నర్లు చేసే నిర్ణయాలపై పార్టీ ముద్ర వుంటుంది. అది పరిష్కారం కానేరదు. ఎన్నికల కమీషనే తన ఆదేశిక సూత్రాల్లోనే ఈ విషయాన్ని చేర్చి, ఈ అనైతిక ప్రవర్తనకు అడ్డుకట్టవెయ్యాలి.

❖ ❖ ❖

భోపాల్ నగరంలో గ్యాస్ లీక్ అయి, వేలాదిమంది మరణించి, మరిన్ని వేలమంది రోగగ్రస్తులైన దుర్ఘటన జరిగి 19 సంవత్సరాలైంది. అయినా ఇప్పటికీ బాధితులు విన్నపాలు చేసుకుంటూనే ఉన్నారు. వారికివ్వాల్సిన నష్టపరిహారం ఇంకా చెల్లించాల్సే ఉంది. 16వేల మంది బాధితులిలా సమస్యలతో మండిపోతుంటే, భారతదేశం వెలిగిపోతుందంటున్నారు వాజ్‌పేయి. ఇంతకన్నా సిగ్గుపడాల్సిన ప్రకటన మరొకటి వుండబోదు. ఆ రాష్ట్ర వెల్‌ఫేర్ కమీషనర్ లెక్కల ప్రకారమే ఇంకా రు.1360 కోట్ల మొత్తాన్ని బాధితులకు అందచేయాల్సి ఉంది. ఈ కమీషనర్ లెక్కలకు, ప్రభుత్వ లెక్కలకు పొంతనేలేదు. ఇంకా చెల్లించాల్సింది రు.475 కోట్లు మాత్రమేనని ప్రభుత్వం అంటోంది. ఇంత డబ్బు ప్రభుత్వం వద్ద లేకుండా పోయిందా అంటే, ఈ నష్టపరిహారం మొత్తాన్ని గ్యాస్ లీక్‌కు కారణమైన బహుళజాతి సంస్థ యూనియన్ కార్బైడ్ సంస్థ ఎపుడో 1989లోనే రిజర్వు బ్యాంకులో జమ చేసింది. అలాంటపుడు రాష్ట్ర ప్రభుత్వానికి ఏం రోగం వచ్చింది? ఈ 19 సంవత్సరాల్లో 10 సంవత్సరాలు కాంగ్రెస్ పాలించింది కాబట్టి, ఈ పాపంలో భాగాన్ని కాంగ్రెస్ పార్టీ పంచుకోవాలి.

నష్టపరిహారం ఇవ్వటం ఒక విషయమైతే, గ్యాస్ లీక్ బాధితుల ఆరోగ్య సమస్యలు మరొక వివాదాస్పద విషయమైపోయింది. ప్రతిరోజూ సగటున 4500 మంది గ్యాస్‌లీక్ బాధితులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూనే వున్నారు. ఈ గ్యాస్‌లీక్ కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలను సృష్టించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మామూలు మందులకే ఠికాణా లేదు. అలాంటపుడు ఈ ప్రత్యేక రోగాల నివారణకు మందులు లభించకపోవటంలో ఆశ్చర్యం లేదు. ఈ ప్రత్యేక రోగాల గురించి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చివారు ప్రత్యేక పరిశోధనలు జరపుతూవచ్చి వాటిని విరమించుకోవటం జరిగింది. ఈ రెండు విషయాల మీద బాధిత సహాయసంస్థలు అభ్యర్థన మేరకు సుప్రీంకోర్టు స్పందించిందిగాని ఆ కోర్టు అడిగిన సమాచారాన్ని అందించేదెపుడు? ఎన్ని సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు చెత్తబుట్టలో పారవేయటం లేదు? ప్రభుత్వాల చర్మాలు దళసరెక్కాయి. ఏదో జరిగితేగాని ప్రభుత్వాలు కదలవు.

– విహారి

ఎన్నికలు - ప్రజల ఎజెండా-2

- వి. కొమరయ్య

ఎన్నికల కోలాహలం పెరుగుతున్న కొద్దీ ప్రజల ఎజెండా వెనక్కిపోతున్నది. పాలకవర్గాలు కూడా తాము ముందు ప్రకటించిన ఎజెండాలను పక్కన పెట్టి కేవలం పొత్తుల ఎత్తుగడలలో, సీట్ల పంపకాలలో మునిగిపోతున్నాయి. నిజంగా ఎన్నికలలో తమ వోటు హక్కును వినియోగించుకుని అభ్యర్థుల భవిష్యత్తునూ, పార్టీల భవిష్యత్తునూ తేల్చగల అధికారం ఉన్న ప్రజలు ఎన్నికల గురించీ, అభ్యర్థుల గురించీ, పార్టీల గురించీ ఏమనుకుంటున్నారో ఎక్కడ బయటపడడంలేదు. ప్రజల కోరికలేమిటో, భవిష్యత్తు గురించి వాళ్ళ ఆశలేమిటో, వాటిని తీర్చేందుకు ఎన్నికల పార్టీలన్నీ ఏం చేయబోతున్నాయో చాలా అస్పష్టంగా ఉంది. ప్రజల కోరికలను మళ్లీ ఏకరువు పెట్టడం చర్విత చర్వణమే కావచ్చుగాని యాభై సంవత్సరాలుగా "ఎన్ని తీర్లెన్నికలు, ఎన్ని మార్లెన్నికలు" వచ్చినా ఏమీ మారలేదని గుర్తించిన ఈ దేశ సాధారణ ప్రజానీకం అవే అవే కోరికలను మళ్ళీ మళ్ళీ ప్రకటిస్తూనే ఉన్నారు. రాజకీయ పక్షాలు తమ ఎన్నికల ప్రణాళికలలోను, వాగ్దానాలలోను ఆ కోరికలలో కొన్నిటిని గుర్తించినట్టే నటిస్తూ యధావిధిగా విస్మరిస్తున్నారు. అందువల్ల మళ్లీ ఒకసారి ఈ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రజాసమస్యలను, ఆ సమస్యలకు ప్రజలు ఆశిస్తున్న పరిష్కారాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంది.

ఇవాళ రాష్ట్రంలో తొంభైశాతం మంది ప్రజలు సమస్యలన్నిటినీ ఒక్కమాటలో చెప్పవలసి వస్తే వారి మనుగడకు సంబంధించిన సమస్యలుగా చెప్పవలసి ఉంటుంది. ఆ సమస్యల రూపాలు ఎటువంటివైనా, వాటి విస్తృతి ఎంతటిదైనా అవన్నీ ప్రజల మనుగడను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అంటే ఇవాళ ప్రజలు ఇదివరకెన్నడూ లేనంతగా జీవన్మరణ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిని తీర్చే ప్రభుత్వాల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకరు కాకపోతే మరొకరు తీరుస్తారేమోనని ఆశిస్తూ పాలకులను మారుస్తున్నారు. కాని దశాబ్దాలు గడిచినా ఆ సమస్యలు తీరకపోగా మరింత జటిలం అవుతున్నాయి. అంటే నానాటికీ మనిషి మనుగడే సందేహాస్పదం అవుతున్నది.

ఈ మనుగడ సమస్యను విశ్లేషించి చూస్తే దానికి భిన్నముఖాలున్నాయని, అవి ఒక్కొక్క వర్గంలో, ఒక్కొక్క ప్రజాసమూహంలోను ఒక్కొక్క రకంగా కనబడుతున్నాయని అర్థమవుతుంది. భూమిలేని నిరుపేద కూలీలకు అది వ్యవసాయ పనుల కొరత సమస్య కావచ్చు. చిన్న, సన్నకారు రైతులకు అది గిట్టుబాటు ధరల సమస్య కావచ్చు. విత్తనాల సమస్య కావచ్చు. సాగునీటి సమస్య కావచ్చు. పెద్దరైతులకు అది పురుగుమందుల సమస్య కావచ్చు. విద్యుత్తు సమస్య కావచ్చు. మొత్తంగా వ్యవసాయ రంగానికి భూసంస్కరణల సమస్య కావచ్చు. ప్రభుత్వోద్యోగులకూ, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులకూ ఉద్యోగభద్రత సమస్య కావచ్చు. లక్షలాది మంది యువజనులకు నిరుద్యోగ సమస్య కావచ్చు. లక్షలాది మంది చిన్నారి పిల్లలకు అందుకోలేనంత ప్రియమైన విద్య సమస్య కావచ్చు. పారిశుధ్యం, పర్యావరణం, ఆకలి, రోగం, దుఃఖం, భద్రత, వినోదం- ఇవాళ జీవితం సమస్తం సమస్యలమయంగా ఉన్నది. ప్రభుత్వాలకు చేతనయితే ఈ సమస్యలను తగ్గించాలని, కనీసం కొత్త సమస్యలు తేకుండా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇవాళ రాష్ట్రంలో అతిప్రధానమైన సమస్యల్లో ఒకటి గ్రామీణ నిరుద్యోగం. మన గ్రామీణ ప్రాంత జనాభా ఆరుకోట్లు ఉంటుందనుకుంటే, ఆ జనాభాకంతటికీ గౌరవప్రదమైన, లాభదాయకమైన ఉపాధి కల్పన అవకాశాలు గ్రామీణ ప్రాంతాలలో లేవు. అందువల్ల గ్రామీణ జనాభాలో రెండురకాలైన ప్రమాదకర పరిణామాలు తలెత్తుతున్నాయి. మొదటిది, విపరీతంగా గ్రామాల నుంచి పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళడం, పట్టణాలలోనైనా, ఇతర ప్రాంతాలలోనైనా వారికి తగిన, గౌరవప్రదమైన ఉపాధి దొరుకుతుందనే హామీ లేదు. అందువల్ల ఆ జనాభాలో నానాటికీ నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయి. ఇక రెండవది, గ్రామీణ ప్రాంతాలలోనే దొరుకుతున్న కొద్ది ఉపాధి అవకాశాలనే ఎక్కువ మంది పంచుకోవడం. అందువల్ల పైకి చూడడానికి అందరికీ పని ఉన్నట్టే కనబడినా, వాస్తవానికి అర్థశాస్త్ర పరిభాషలో చెప్పే 'ప్రచ్ఛన్న' నిరుద్యోగం మన గ్రామసీమల్లో రాజ్యం చేస్తున్నది. అంటే మానవ వనరుల సద్వినియోగం కాక దుర్వినియోగం జరుగుతున్నది.

ఈ సమస్యను పరిష్కరించడం ఇవాళ ఏ పాలకపక్షానికైనా అత్యంత ప్రధానమైన కార్యక్రమంగా ఉండాలి. అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇతోధికంగా ఉద్యోగ, ఉపాధి కల్పనా అవకాశాలను పెంపొందించడం ప్రజల ఎజెండాలో ముఖ్యమైన అంశం. ఇందుకు వ్యవసాయరంగం మీద దృష్టి కేంద్రీకరించాలి. గ్రామీణ ప్రాంతాలలో

సాగయ్యే భూమి విస్తీర్ణాన్ని పెంచాలి. నీటిపారుదల సౌకర్యాలను విస్తరించాలి. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు చౌకధరలకు విస్తారంగా అందించాలి. రైతాంగానికి రుణ, పరపతి సౌకర్యాలను పెంచి వ్యవసాయ పనులు విపరీతంగా జరిగేలా చూడాలి. పంటలకు గిట్టుబాటు ధరలు అందేలా మార్కెట్లను నియంత్రించడం ద్వారా వ్యవసాయరంగం నుంచి రైతాంగం పక్కకు మళ్ళిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాలలో నీటిపారుదల, రవాణా, చిన్నతరహా పరిశ్రమలు చేపట్టేటప్పుడు ఆ పనులకు యంత్రాలను వినియోగించి, ఆ ప్రాంతంలో పనిచేయగల పేదల కడుపుకొట్టకుండా, మానవ శ్రమనే వినియోగించాలి.

నిజానికి ఈ పనులేవీ అసాధ్యమైనవి కావు. ఈ పనులు కొండ మీది కోతిని తెచ్చి ఇమ్మనేంత గొంతెమ్మ కోర్కెలేమీ కావు. ఈ పనులు చేయడానికి వ్యవస్థ ఏమీ మారనవసరం లేదు. అధికారం కోసం వెంపర్లాడుతున్న రాజకీయపక్షాలకు గ్రామీణ ప్రజానీకం పట్ల కాస్త శ్రద్ధ, ప్రజాప్రయోజనాల కోసమే ప్రభుత్వాలు పని చేయాలనే అంకితభావం ఉంటే చాలు. ఉదాహరణకు గత ఆరేడు సంవత్సరాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి చిన్న పనికీ ప్రొక్లైయిన్లను వాడి, అక్కడ ప్రజలకు దొరకగల కొద్దిపాటి పనులను కూడా కొల్లగొట్టడం జరిగింది. ఆ ప్రజల కడుపుకొట్టడం జరిగింది. ప్రభుత్వం నుంచి ఈ పనులు రాబోతున్నాయని తెలిసి ప్రొక్లైయిన్లు కొనిపెట్టుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంట్రాక్టర్లు పొట్టనింపుకోవడానికి తప్ప ఆ పనుల పరమార్థం మరేమీ లేకపోయింది. కాల్వలు తవ్వడం, రోడ్లు వెయ్యడం లాంటి ఒకేపని అటు ప్రజల ఎజెండాలో ఉంటే ఎలా ఉంటుందో, ఇటు పాలకుల ఎజెండాలో ఉంటే ఎలా ఉంటుందో ఈ ఉదాహరణే తెలియజేస్తుంది.

భూసంస్కరణల వంటి పెద్ద కార్యక్రమం ఎప్పటికప్పుడు చేపట్టే అవకాశం లేదనుకున్నా, కనీసం భూమిని ఉపయోగకరంగా, ఎక్కువ ఫలసాయం వచ్చేట్టుగా వాడుకోవడానికి, తద్వారా వ్యవసాయ పనులు పెరిగి గ్రామీణ నిరుద్యోగం తగ్గడానికి నీటిపారుదల సౌకర్యాలను విస్తరించడం తక్షణావసరం. రాష్ట్రంలో ఇప్పటి వరకూ కొనసాగుతున్న నీటిపారుదల విధానం ఏ మాత్రం దూరదృష్టి లేకుండా అస్తవ్యస్తంగా సాగుతోంది. భారీ నీటిపారుదల సౌకర్యాలు కల్పిస్తామనే పేరుతో చిన్న, గ్రామీణ స్థాయి నీటివనరులను ధ్వంసం చేయడం జరిగింది. అంతర్రాష్ట్ర నదీజలాలలో రాష్ట్రపు వాటాను సక్రమంగా వినియోగించే కార్యక్రమాలు చేపట్టకపోగా అతి విలువైన భూగర్భ జలాలు క్షీణించిపోయే పనులు చేపట్టడం జరిగింది. అందువల్లనే ఆంధ్రప్రదేశ్ ఏర్పడి యాభై సంవత్సరాలు కావస్తున్నా, గోదావరి జలాలతో మన వాటా 1400 టిఎంసిలుగా ట్రిబ్యునల్ నిర్ధారణ జరిగి ముప్పై సంవత్సరాలు కావస్తున్నా ఇవాల్టికీ 600 టిఎంసిల కన్నా ఎక్కువ వినియోగంలోకి రాలేదు. మరోపక్క కృష్ణాజలాల్లో మన వాటా 800 టిఎంసిలు పూర్తిగా వాడుకున్నప్పటికీ ఎగువ తెలంగాణా ప్రాంతానికి ప్రాతినిధ్య వాటా అందనే లేదు. ఇంకా తమ వాటా పూర్తిగా వాడుకోవలసి ఉన్న ఎగువ రాష్ట్రం కర్ణాటక మీద తెలుగు ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడానికి పాలకవర్గాలు ప్రయత్నించాయి.

ఇప్పటికైనా జలవనరుల మీద ఒక సమగ్రమైన, ఆచరణ సాధ్యమైన, సుస్థిరమైన విధానాన్ని పాలకులు ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు. ఇందులో భారీ, మధ్యతరహా, చిన్నతరహా జలవనరుల గురించి భూగర్భ జలవనరుల గురించి ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలి. ఇప్పటివరకు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్ని జలవనరుల సద్వినియోగం గురించి సంరక్షణ గురించి ఎన్ని ఆడంబరాలైన వాగ్దానాలు చేసినా ఆచరణలో సాధించింది శూన్యం. రాష్ట్రంలో సాగుకు లాయకైన రెండున్నర కోట్ల ఎకరాలకు పైగా భూమిలో నికరంగా సాగునీటి పారుదల సౌకర్యాలు అధికభాగం 3వ వంతుకన్న తక్కువ, జలవనరుల్లోని నాలుగు ముఖ్యభాగాల్లో ఏ ఒక్కభాగానికి కేటాయింపులు జరపకపోగా, భారీనీటిపారుదలకు ఎక్కువ కేటాయింపులు ఇస్తున్నామనే పేరుతో చిన్న నీటిపారుదల వ్యవస్థలను ధ్వంసం చేయడం జరిగింది. భూగర్భ జలవనరుల వినియోగంలో సమన్వయ దృక్పథం కొరవడి ఆ వనరులు అదృశ్యమైపోయే దుస్థితి దాపురించింది. కృష్ణా, గోదావరి నదుల మీద భారీ పథకాలుగానీ, వందలాది చిన్ననదులు, సెలయేర్లు వాగులపై మధ్యతరహా సదుపాయాలుగానీ కల్పించకపోగా, కాకతీయుల నాటినుంచి, విజయనగర రాజులనుంచి, తెలంగాణాలో రాయలసీమలో రూపొంది ప్రజల అవసరాలు తీరుస్తున్న స్థానిక చిన్నతరహా నీటిపారుదల వ్యవస్థలను నిర్లక్ష్యం చేసి కనీస పూడికలు కూడా తీయకుండా పనికి రాకుండా చేయడం జరిగింది. ఎన్నోచోట్ల ఆ ప్రాచీన చెరువులు, తటాకాల కింద ఆయకట్టు సగానికి సగం తగ్గిపోయింది. భూగర్భజల దుర్వినియోగం వల్ల భూములు పడావుపడి, బావులు వట్టిపోయాయి. ఈ అన్ని పరిణామాలు వ్యవసాయ రంగాన్ని దారుణంగా దెబ్బతీశాయి. వ్యవసాయానికి ముఖ్య అవసరమైన నీటిపై పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయింది. వ్యవసాయరంగం కునారిల్లిపోవడానికి నీటిసమస్య ఒక ప్రధాన కారణమైంది.

మరోవైపు వ్యవసాయరంగం మీద, నకిలీ విత్తనాలు, పెరిగిపోయిన ఎరువుల వ్యయం, నకిలీ పురుగుమందులు, ఎడాపెడా దాడిని కొనసాగించాయి. విత్తనాల విషయంలో ఎరువుల విషయంలో,

పురుగుమందుల విషయంలో, విద్యుచ్ఛక్తి విషయంలో ప్రభుత్వాలు వ్యవసాయానుకూల ప్రజానుకూల విధానాలు తీసుకోలేదు సరికదా చట్టంలో ఉన్న మేరకు ప్రజానుకూల నిబంధనలను కూడా అమలు చేయలేదు. ఈ ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చే ప్రభుత్వం ఈ అన్ని అంశాల్లోనూ ప్రజానుకూల వైఖరి తీసుకోవాలని, రైతాంగానికి ప్రయోజనాన్ని చేకూర్చే చట్టాలలోని అంశాలన్నింటిని అమలు చేయాలని, ఇంకా ఎక్కువగా వ్యవసాయరంగానికి ప్రయోజనం కలిగించే విధానాలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. గిట్టుబాటు ధరలను ప్రకటించడం, అమలు చేయడం కూడా వ్యవయాసానుకూల విధానంలో భాగంగా ఎంచాలి. సరిగ్గా ఎన్నికల సందర్భంలో టమాటా, మిర్చి, పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్య, చేస్తున్న డిమాండ్లు రైతాంగ ఎజెండాను ప్రకటిస్తున్నాయి.

వ్యవసాయరంగం తర్వాత ప్రధానమైన రంగం పరిశ్రమలు. ముఖ్యంగా దేశంలో నూతనార్థిక విధానాలు ప్రవేశించినప్పటి నుంచి కొత్త పరిశ్రమల స్థాపన తగ్గిపోయింది. పరిశ్రమల ద్వారా ఉద్యోగ కల్పన సాధించాలనే ఆశయం అడుగంటిపోయింది. ఎక్కడైనా ఒకటీ అరా పరిశ్రమల స్థాపన జరిగినా అవి శ్రమాధారిత పరిశ్రమలుకాక యంత్రాధారిత పరిశ్రమలు కావడం వల్ల ఉద్యోగకల్పన తగ్గిపోయింది. మార్కెట్లలోనే విదేశీ కంపెనీలు చొరబాటువల్ల స్థానిక పరిశ్రమలు చితికిపోయి దేశవ్యాప్తంగాను, రాష్ట్రంలోనూ లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మొత్తంగా కార్మికులకు ఉద్యోగాలకు ఉద్యోగ భద్రత లేని స్థితి వచ్చింది. కనుక రాష్ట్రజనాభాలో దాదాపు ఆరవ వంతుగా ఉన్న పారిశ్రామికరంగ జనాభాగాని, మరో ఆరోవంతు ఆక్రమించే చేతివృత్తుల వారికిగాని ఉపాధికల్పన ఉద్యోగభద్రత ప్రధాన డిమాండ్లు. కొత్తగా అధికారంలోకి వచ్చే ప్రభుత్వమేదైనా ఇతోధికంగా శ్రమాధారిత పరిశ్రమలు నెలకొల్పి విరివిగా ఉద్యోగ కల్పన సాధిస్తామని ఉన్న ఉద్యోగాలకు భద్రత కల్పిస్తామని, స్థానిక పరిశ్రమల ఉత్పత్తులకు చేతివృత్తుల ఉత్పత్తులకు తగిన మార్కెట్ కల్పిస్తామని హామీ ఇవ్వాలి. నూతన ఆర్థిక విధానాలను అమలు చేయడానికి ఈ హామీకి చుక్కెదురు. కనుక ఆ మేరకు నూతన ఆర్థిక విధానాలను అమలు చేయబోమని కూడా ఆయా పార్టీలు ప్రకటించాలి.

ప్రత్యేకించి వ్యవసాయ రంగానికి, పారిశ్రామిక రంగానికి ఉన్న ఈ డిమాండ్లలాగానే విడివిడి ప్రజాసమూహాలకు వారివారి డిమాండ్లు ఉంటాయి. ఆ డిమాండ్లన్నింటిని కూడా ఏదో ఎన్నికల వాగ్దానాలలాగా శుష్కమైన హామీలు ఇవ్వకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రకాళికతో కూడిన హామీలు ఇవ్వాలని వాటిని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ డిమాండ్లతో పాటుగా మొత్తంగా సామాజిక అభివృద్ధికి అంటే సామాజిక మనుగడకు పురోగమనానికి సంబంధించిన సాధారణ సమస్యలు డిమాండ్లు కూడా ఉన్నాయి. అవి విద్య, వైద్యం, ఆరోగ్యం, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, పర్యావరణం, భద్రత, ఆహ్లాదకరమైన మానసిక వికాసానికి వీలుకల్పించే వాతావరణం మొదలైన అంశాలు.

50 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య కల్పిస్తామని, రాజ్యాంగం చేసిన వాగ్దానం గడిచిపోయి నలభై సంవత్సరాల తర్వాత కూడా చదువుకు నోచుకోని కోట్లాదిమంది బాలలున్న సమాజం మనది. అక్షరసంక్రాంతి, అక్షరవెలుగు, రాజీవ్‌గాంధి అక్షరాస్యతా మిషన్, అందరికీ చదువు, చదువుల పండుగ, మళ్లీ బడికివంటి లెక్కలేనన్ని కార్యక్రమాల మీద వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టినా అక్షరాస్యతా శాతాన్ని ఎంతగా పెంచి దొంగలెక్కలు చూపినా ఇప్పటికి రాష్ట్రంలో నిరక్షరాస్యుల సంఖ్య నలభై శాతంగా ఉంది. ఈ స్థితిని మార్చాలని చదువుకోవడానికి ఆటంకంగా ఉన్న పేదరికాన్ని రూపుమాపి విద్యావకాశాలను అందరికీ అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. జ్ఞాన ఆధారిత సమాజం అని గొప్పలు చెప్పుకోవడానికన్న ముందు కనీస ప్రాథమిక విద్యావకాశాల కల్పనపై శ్రద్ధ చూపాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు.

ఏ సమాజమైనా సరైన మనుగడ సాగించాలంటే ప్రగతి సాధించాలంటే మంచి వైద్య ఆరోగ్య సౌకర్యాలుండడం అత్యవసరం. వైద్య, ఆరోగ్య సేవలను ప్రైవేటీకరించాలని, ప్రజల ఆరోగ్యాన్ని ప్రైవేటు లాభార్జనాపరుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం కంటే ప్రభుత్వమే పూనుకొని ప్రజాధనాన్ని వ్యయం చేసి తగిన వైద్య, ఆరోగ్యసేవలు అందించవలసి ఉంటుంది. ఇప్పటికే వైద్య, ఆరోగ్యరంగాల్లో కొనసాగుతున్న విధానాలు తప్పుడు దిశలో ప్రజావ్యతిరేకంగా నడుస్తున్నాయి. రానున్న ప్రభుత్వమేదైనా ఈ దిశను మార్చాలని వైద్య ఆరోగ్య రంగాలను ప్రజావసరాలు తీర్చేట్టుగా మలచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తాగునీటి సౌకర్యాల కల్పన, పారిశుధ్య సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ, ఆహ్లాదకరమైన వాతావరణం, భద్రతవంటివి నిజానికి ప్రజలు డిమాండు చేయనవసరమే లేదు. వీటిని కల్పించడంలో ప్రభుత్వాలు తమ బాధ్యతగా భావించాలి. రాచరికపాలనలోనే ఇటువంటి సౌకర్యాలను కల్పించడం ప్రభుత్వాలు తమ బాధ్యతగా భావించాయి. తమకు తాము ప్రజాస్వామిక పాలనలుగా చెప్పుకొనే ప్రభుత్వాలు ఈ పనులను వదిలేయడం వాటి అప్రజాస్వామికతకు నిదర్శనం. ఈ పనులన్నీ బృహత్తరమైనవి కావచ్చు. ఒక ప్రభుత్వం ఒక్కరోజులో చేయలేని పనులే కావచ్చు, కనీసం ఆ దిశలో నడుస్తున్నామనైనా చూపుకోవడం ప్రభుత్వాల బాధ్యత అవుతుంది. రానున్న ప్రభుత్వమేదైనా అటువంటి సూచననే అందించాలని ప్రజలు కోరుతున్నారు. ○

స్త్రీల అధికార యోగానికి ఓటు హక్కుకు మధ్య అగాధం

చాలా దేశాలు, మహిళలు ఓటింగు హక్కుతో పాటు ఎన్నికలలో పోటీ చేసి ఎన్నికయ్యే హక్కును కూడా ఇచ్చాయి. కాని కొన్ని దేశాలలో (ఇందుకు ఉదాహరణగా నెదర్లాండ్స్, నార్వే, అమెరికాలను చూపవచ్చు) మహిళలకు ఎన్నికలలో పోటీ చేసే హక్కు ముందు లభించింది. తర్వాత కొంతకాలానికి గాని ఓటింగు హక్కు వీరికి లభించలేదు.

ఈ విషయాన్ని అమెరికా అనుభవం చక్కగా చిత్రిస్తున్నది. 1788లో పాసైన రాజ్యాంగం (కాన్స్టిట్యూషన్) ఏ "వ్యక్తైనా" (పర్సన్) లేక "సభ్యుడయినా" (మెంబర్) ఎన్నిక కావచ్చును అని పేర్కొన్నదే గాని ఈ విషయంలో స్త్రీ-పురుష లింగభేదాన్ని ప్రస్తావించలేదు. ఇందువల్ల పురుషుల వలె, స్త్రీలు కూడా ఎన్నికలలో పోటీచేసి, కాంగ్రెస్ ప్రతినిధిగా వెళ్లే అవకాశం కలిగింది. కాని మహిళలకు ఈ రాజ్యాంగం ఓటింగు హక్కును (తమ ప్రతినిధులను ఎన్నుకొనే హక్కును) ఇవ్వలేదు. దానిని పురుషులకు మాత్రమే పరిమితం చేసింది. 1920వ సంవత్సరంలో రాజ్యాంగ సవరణ ఆమోదం తర్వాతనే మహిళలకు ఓటు చేసే హక్కు లభించింది. ఫెడరల్ యూనియన్లోని కొన్ని రాష్ట్రాలు (స్టేట్స్) ఇంతకు పూర్వమే మహిళలు, తమ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికయ్యే హక్కుతో, ఓటింగు హక్కును కూడా ఇచ్చాయి. కొందరు మహిళా ప్రతినిధులు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికయినారు. 1920వ సంవత్సరపు రాజ్యాంగ సవరణ చట్టం పాస్ కాకపూర్వమే, 1916వ సంవతసరంలో, వ్యోమింగ్ రాష్ట్రానికి చెందిన మహిళ, జీనెట్ రాన్కిన్ యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్కు ఎన్నికైనారు.

ఒకటవ పట్టిక

స్త్రీ పార్లమెంటుకు ఎన్నికయ్యే అర్హతను సంపాదించటానికి, తొలి స్త్రీ పార్లమెంటుకు ఎన్నిక కావటానికి పట్టిన కాల వ్యవధి

ఓటింగు హక్కు లభించిన తర్వాత పార్లమెంటుకు తొలి స్త్రీ ఎన్నికకు పట్టిన కాల వ్యవధి	స్త్రీ ఎన్నికైన దేశాల సంఖ్య	దేశాల శాతం
ఓటింగ్ హక్కు లభించక పూర్వం	7	8.1
అదే సంవత్సరంలో	27	31.4
ఒకటి లేక రెండు సం॥ల తర్వాత	14	16.3
మూడు సం॥ లేక అంతకుమించిన కాలం తర్వాత	38	44.2

ఆధారం : పార్టిసిపేషన్ ఆఫ్ ఉమెన్ ఇన్ పొలిటికల్ లైఫ్ అండ్ ఇన్ ది డిసిషన్ - మేకింగ్ ప్రాసెస్ - ఎ వరల్డ్ సర్వే ఏప్రిల్ 1988

ప్రథమ ప్రపంచ సంగ్రామంలో అమెరికా పాల్గొనాలన్న తీర్మానికి వ్యతిరేకంగా ఓటు చేసిన ఏకైక కాంగ్రెస్ సభ్యులు వీరే!

మహిళలకు ఓటు చేసే హక్కునిచ్చి, దానితో పాటే ఎన్నికలలో పోటీ చేసే హక్కునివ్వని దేశాలు కూడా కొన్ని వున్నాయి. కెనడా 1917వ సంవత్సరంలో మహిళలకు ఓటింగు హక్కు నిచ్చినా 1920వ సంవత్సరంలోగాని, మహిళలు ఎన్నికలలో పోటీ చేసే హక్కునివ్వలేదు. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే ముందే మహిళలకు ఓటింగు హక్కు నిచ్చిన ఖ్యాతిని పొందిన దేశం న్యూజిలాండ్, 1983వ సంవత్సరంలో స్త్రీలకు ఓటింగ్ హక్కునిచ్చినా, 1919వ సంవత్సరం వరకూ వారు ఎన్నికలలో పోటీ చేసే అధికారాన్నీయలేదు. ఇలాగే పెరూ, స్త్రీలకు ఓటింగు హక్కును 1950లో ఇచ్చినా, పోటీ చేసే హక్కును 1956 వరకూ ఇవ్వలేదు. సిరియన్ మహిళలకు ఓటింగు హక్కు 1949లో లభించినా, ఎన్నికలలో పోటీ చేసే హక్కు 1953వ సంవత్సరంలోగాని లభించలేదు. జయర్ మహిళలకు 1967లో ఓటింగు హక్కును మహిళలకు 1967లో ఓటింగు హక్కును ప్రభుత్వం ఇచ్చినా, 1970వ సంవత్సరం వరకూ వారు పోటీ చేసే హక్కునీయలేదు. జింబాబ్వే 1957లో తమ దేశపు మహిళలకు ఓటింగు హక్కునిచ్చినా, ఎన్నికలలో పోటీ చేసే హక్కును వారకి 1978వ సంవత్సరం వరకూ ఇవ్వలేదు.

ఇల్లు అలకగానే పండగ కాదని పెద్దలు చెప్పారు. మహిళలకు ఓటింగ్ హక్కు, ఎన్నికలలో పోటీ చేసే హక్కు లభించినంత మాత్రాన వారు ప్రజాప్రతినిధి సభలకు ఎన్నికవుతారని ఆశించటం పొరపాటు. వారు ప్రజాప్రతినిధి సభలకు ఎన్నిక కావటానికి మధ్య ఎంతకాల వ్యవధి పట్టిందో సూచించే 86 దేశాల సర్వే సమాచారాన్ని ఇంటర్ పార్లమెంట్ యూనియన్ 1988లో ప్రచురించింది. (ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ ప్రభుత్వేతర సంస్థ. ఇది పలు దేశాల జాతీయ పార్లమెంట్ల సమాఖ్య. పలు దేశాల పార్లమెంటరీ సమాచారం ప్రతిరూపమే ఒకటవ పట్టిక).

ఈ సర్వేలోని దేశాలలో దాదాపు సగం దేశాలలో మాత్రమే ఓటింగు హక్కు లభించిన ఒకటి లేక రెండు సంవత్సరాల లోపలే మహిళా ప్రతినిధులు పార్లమెంట్లకు ఎన్నికయ్యారు. ఎన్నికలలో పోటీ చేసే హక్కును పొందిన ఐదేండ్ల తర్వాత మాత్రమే చాలా దేశాలలో మహిళలకు పార్లమెంటుకు ఎన్నిక కాగలిగారు. సర్వజనీన మహిళా ఓటింగు హక్కు రాకపూర్వమే, పరిమితంగానైనా ఓటింగు హక్కులు వున్నచోట కూడా, మహిళలు పార్లమెంటుకు ఎన్నిక కావటం కనిపిస్తుంది. కొన్ని దేశాలలో ఆస్తి, లేక ఇతరాలు ఓటింగు హక్కు లభించటానికి

ప్రాతిపదికలుగా వున్నాయి. ఉదాహరణకు నార్వే అనుభవానిన తీసుకొందాం. ఈ దేశంలో తొలి మహిళ, 1911వ సంవత్సరంలనే పార్లమెంటు సభ్యురాలిగా ఎన్నికైంది. 1913వ సంవత్సరంలోగాని, ఈ దేశంలో సర్వజనీన మహిళా ఓటింగు హక్కు అమల్లోకి రాలేదు.

మహిళలకు ఓటింగు హక్కు లభించటానికి, తొలి మహిళ, దేశపు పార్లమెంటుకు ఎన్నిక కావటానికి, అన్ని దేశాలలో కంటే అత్యధిక కాల వ్యవధి (అరవయ్యేదు సంవత్సరాలు) ఆస్ట్రేలియాలో పట్టింది. 1988వ సంవత్సరం నాటికి ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ వద్ద నున్న సమాచారం ప్రకారం, జోర్డాన్, మొరాకో, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల పార్లమెంట్లకు ఒక్క మహిళ కూడా ఎన్నిక కాలేదు. ఒక్కసారి మహిళలలో ఒక్కరు పార్లమెంటుకు ఎన్నిక కాగలిగితే, అటు తర్వాత అధికులు పార్లమెంటుకు వెళతారన్న గ్యారంటీ లేదని అనుభవం నిరూపించింది.

నామమాత్రపు సంఖ్యలో స్త్రీలు పార్లమెంటకు వెళ్ళటం వలన మహిళా లోకానికి మేలు జరగదు. పార్లమెంటు నిర్ణయాలను ప్రభావితం చేయగలిగినంత సంఖ్యా పరిమాణంలో స్త్రీల ప్రాతినిధ్యముండాలి. అపుడు, నిర్ణీత దేశంలోని స్త్రీల పరిస్థితికి, పార్లమెంటులోని వారి సభ్యత్వ పరిమాణం కొలమానంగా మారుతుంది. అంతేకాదు; మంత్రివర్గ

రెండవ పట్టిక

కొన్ని దేశాల పార్లమెంట్లలో, మున్సిపాలిటీలలో, మంత్రివర్గాలలో మహిళా సభ్యత్వ శాతాలు (1994)

దేశం పేరు	పార్లమెంటరీ సభ్యత్వం	మున్సిపాలిటీలో సభ్యత్వం	మంత్రివర్గ సభ్యత్వం
పారిశ్రామిక దేశాలు			
డెన్మార్క్	33	28	29
ఫిన్లాండ్	39	30	39
నెదర్లాండ్స్	29	22	31
నార్వే	39	28	35
స్వీడన్	34	34	30
ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓ.ఇ.సి.డి.) దేశాలు	13	16	15
అభివృద్ధి చెందుతున్న దేశాలు			
క్యూబా	23	14	4
గుయానా	20	22	11
జమైకా	12	13	5
నికారుగ్వా	16	13	10
ట్రినిడాడ్ అండ్ టొబాగో	18	21	19
అభివృద్ధి చెందుతున్న దేశాలు	10	–	5
ప్రపంచం	10	–	6

ఆధారం : హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్ట్ 1995

మూడవ పట్టిక

తూర్పు యూరపు "ప్రజాస్వామ్యపు" పాలు పెరుగుతున్న కొలదీ తగ్గిపోతున్న మహిళా పార్లమెంట్ ప్రాతినిధ్యం (అంకెలు శాతాలను తెలియజేస్తాయి)

దేశం పేరు	1988	1990-91
ఆల్బేనియా	28.8	6.2
బల్గేరియా	21.0	8.5
జెకోస్లావాకియా	29.5	6.0
తూర్పు జర్మనీ	32.2	20.5
హంగరి	20.9	7.0
పోలెండ్	20.2	13.3
రొమేనియా	34.4	3.5
సోవియట్ యూనియన్	34.5	15.6
యుగోస్లావియా	17.7	17.7
అన్ని దేశాల సగటు	27.5	10.9

సభ్యులు కావాలంటే, ముందు పార్లమెంటులో సభ్యత్వాన్ని పొందాలి. ఓటర్లలో దాదాపు సగం మందిగా వున్న స్త్రీలకు, పార్లమెంటులో తగినంత ప్రాతినిధ్యం లేనపుడు, ఆ పార్లమెంటు మహిళా శ్రేయస్సుకు అనుగుణంగా పని చేయలేదు. దాని నిర్ణయాలు మహిళా లోకపు శ్రేయస్సుకు అనుకూలంగా ఉండే అవకాశాలుండవు. పార్లమెంటులోని సీట్లలో సగభాగం మేరకు స్త్రీలకు లభించకపోయినా, జరిగే నిర్ణయాలను ప్రభావితం చేయగలగటానికి కనీసం మూడవ వంతు (30 నుండి 35 శాతం వరకూ) సభ్యత్వం స్త్రీలకు లభించాలన్నది సర్వజనామోదాన్ని పొందిన పరిమితి. 1995వ సంవత్సరంనాటికైనా, మహిళల పార్లమెంటు సభ్యత్వం ముప్పైశాతానికి చేరాలని ఐక్యరాజ్యసమితికి చెందిన ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ లక్ష్యాన్ని నిర్ణయించింది. మహిళల సభ్యత్వ పరిమాణం, ఇప్పటి రేటునే పెరిగితే, పురుషులతో సమానమైన సభ్యత్వ సాధన విషయం దేవుడెరుగు, మూడవ వంతు పరిమాణ సాధనైనా 22వ శతాబ్ద కాలంలోనైనా సంభవిస్తుందా అన్న సందేహం కలుగుతుంది.

ఈ అధ్యాయంలోని రెండవ పట్టికను పరిశీలిస్తే డెన్మార్క్, ఫిన్లండ్, నార్వే, స్వీడన్ దేశాలలో మాత్రమే మహిళా పార్లమెంటరీ ప్రాతినిధ్యం ముప్పై శాతాన్ని మించి ఉన్నట్లు కనిపిస్తుంది. ఫిన్లండ్, నార్వేలలో మాత్రం మహిళా ప్రాతినిధ్యం దాదాపు నలభై శాతం వరకూ ఉంది. మిగిలిన అన్ని దేశాలలోనూ మహిళా ప్రాతినిధ్యం ఆశించదగిన పరిమాణంలో లేదని ఇదే వ్యాసంలోని రెండవ, మూడవ పట్టికలు తెలియచేస్తున్నాయి.

– కె.ఎస్.రెడ్డి,

(స్త్రీ పురుష అసమానత-సమస్యలు నుండి)

మతోన్మాదులతో పెనవేసుకుంటున్న చంద్రబాబు

– తెలకపల్లి రవి

ఎన్నికల పర్వం మొదలైనప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హడావుడి, అవకాశవాదం తారాస్థాయికి చేరుతున్నాయి. దశలవారీగా ఒకో అనవసర సమస్యపై చర్చ లేవనెత్తడానికి విఫలయత్నం చేస్తూనే వున్నారు. మరోవంక సామదాన భేద దండోపాయాలు ఉపయోగించి ఎన్నికల్లో బతికిబట్టకట్టడానికి తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆయనకు మిగిలిన ఆఖరి ఆధారంగా బిజెపి కనిపిస్తోంది. ముందస్తు ఎన్నికల ప్రకటనకు ముందే బిజెపి అగ్రనేతలైన అద్వాని, వెంకయ్యనాయుడులతో మంతనాలు జరిపిన చంద్రబాబు ఎన్నికలు నిర్ణయమయ్యాక పుట్టపర్తి సాయిబాబా సన్నిధిలో ప్రధాని వాజ్‌పేయితో రెండు రోజులు భేటీ వేశారు. (ఈ సందర్భంగా అటు ముఖ్యమంత్రి ఇటు ప్రధానమంత్రి ఇద్దరి భుజాలపై సాయిబాబా చేతులేసి ఆశీర్వదిస్తున్న ఘట్టం మన లౌకిక విలువలకు నీరాజనమనుకోవాలి). ఈ ఘట్టాలన్నిటిలోనూ చంద్రబాబు తను బిజెపికి నమ్మకమైన నేస్తంగా వుంటానని, జాతీయ స్థాయిలో తన విలువ దృష్ట్యా రాష్ట్రంలో సీట్ల సర్దుబాటు పట్ల ఉదారంగా వ్యవహరించవలసిందని మొరపెట్టుకున్నారని వేరే చెప్పనవసరం లేదు. కేంద్రంలోని కాషాయ పాలకుల పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. కనుక వారూ తమ రాష్ట్ర పదాధికారులకు, అధినేతలకు నచ్చజెప్పి ఒప్పించారు. బిజెపి ఆరెస్సెస్‌తో చెట్టాపట్టాలేసుకుని అయోధ్య తదితర వివాదాస్పద అంశాలు తమ విజన్‌లో వుంటాయని బాహాటంగా ప్రకటించిన తదనంతరమే తెలుగుదేశం దాన్ని పూర్తిగా వాటేసుకోవడం ఇక్కడ విశేషం.

ఉప ప్రధాని, మతోన్మాద రాజకీయ సూత్రధారి ఎల్.కె. అద్వాని రథయాత్రలో చంద్రబాబు ఉత్సాహంగా పాల్గొనడం ఈ పరిణామాలకు సహజమైన కొనసాగింపే. ఇది ఇంగ్లీషు నానుడిలో చెప్పే ఆఖరి గడ్డిపరకలా ఉంది. తెలుగుదేశం లౌకిక నిబద్ధతకు గొడ్డలిపెట్టు. ఎన్టీఆర్ అధ్యక్షుడిగా ఉన్న నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం రథయాత్ర ఒత్తిడికి లొంగిపోవడానికి నిరాకరించింది. ఆ సందర్భంగా ఎల్.కె. అద్వానీ హైదరాబాదు చేరుకున్నప్పుడు ఎన్టీఆర్ ఆయనను నిలువరించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. అద్వానీ రైలు వెళ్ళిపోతుందని బయలుదేరితే రామారావు రైలు నిలిపివేస్తానని అన్నారు. చివరకు వి.పి. సింగ్ రాజీనామా చేశారు. కాని రాజీ పడలేదు. బాబరీ మసీదు విధ్వంసం తర్వాత వామపక్షాలతో కలసి మతసామరస్య కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్ని ప్రతిపక్షాల ఐక్యత అంటూ బయలుదేరిన రామారావు బిజెపి లేకుండానే నేషనల్ ఫ్రంట్ ఏర్పరచారు. చివరి వరకూ ఆ లౌకికతత్వానికే కట్టుబడ్డారు. చంద్రబాబు నాయుడు అప్పట్లో ఈ కార్యక్రమాలన్నింటిలో భాగస్వామి.

తనే ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయన వామపక్షాల మద్దతుపై ప్రధానంగా ఆధారపడ్డారు. 1996 ఎన్నికల్లో వామపక్షాలతో పాటుగానే పోటీచేశారు. బిజెపి మసీదులు కూల్చుతుంటే మేము కట్టిస్తున్నామని ప్రచారంలో చెప్పారు. ఆ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏ పార్టీకి మెజారిటీ రాని స్థితిలో వామపక్షాలు, లౌకిక ప్రాంతీయ పార్టీలు కలిసి యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. చంద్రబాబు ఫ్రంట్ ప్రతినిధిగా, తర్వాత కన్వీనర్‌గా కీలకపాత్ర పోషించారు. అప్పుడే అనుకూల మీడియా ఆయన చక్రం తిప్పాడంటూ భజన కీర్తనాలాపించింది. దేవెగౌడను కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం కేసరి కూలదోసిన తర్వాత కూడా దానితో మంతనాలు జరపడంలో చంద్రబాబు కూడా ముఖ్యపాత్ర వహించాడు. నిజానికి ఇందులో ఒకడుగు ముందేవున్నాడు. అది కూడా కూలిపోయిన తర్వాత కూడా ఆయన వామపక్ష లౌకిక పార్టీలతోనే వున్నాడు. 1998 మధ్యంతర ఎన్నికల్లో కూడా వాటితో కలిసే పాల్గొన్నాడు. ఎటొచ్చి ఆ ఎన్నికల తర్వాత కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పడే అవకాశం రావడంతో అంతామారిపోయింది.

యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఆ కీలక సమయంలో చొరవ తీసుకోవడానికి బదులుగా చంద్రబాబు రకరకాలుగా మాట్లాడుతూ రాజకీయ పిల్లిమొగ్గలు వేశారు. కన్వీనర్‌గా వున్న తానే ఫ్రంట్ ఇంకెక్కడుందని వాపోవడం ప్రారంభించారు. కొత్త లోక్‌సభ కొలువు తీరే సమయం వచ్చింది. స్పీకర్ కోసం అన్వేషణ మొదలైంది. అప్పుడే తెలుగుదేశం ప్లేటు మార్చవచ్చన్న సూచనలు వెలువడ్డాయి. బాబు అందీఅందకుండా మాట్లాడుతూ బిజెపితో చెలిమికి రంగం సిద్ధం చేశాడు. ఆఖరి క్షణాల్లో ఆఘమేఘాల మీద బాలయోగిని తరలించి, స్పీకర్‌ను చేశారు. తద్వారా ఆయన వ్యూహాత్మకంగా బిజెపికి చెప్పలేని మేలు చేశాడు. సభా నిర్వహణలో బిజెపి వారు వుండి పక్షపాతం ఆరోపణలు ఎదుర్కోనవసరం లేకుండానే వారి పని చేసిపెట్టే వసతి కల్పించాడు. రెండవది– సర్కారులో భాగస్వామి కాకుండా పరోక్షంగా

కేంద్రంలో తిష్టవేశాడు. చంద్రబాబు రాజకీయ జీవితంలోనే గాక భారత రాజకీయాలలోనే అతిపెద్ద రంగుమార్పిడి ఇది. తా జెడ్డకోతి వనమెల్ల చెరిచిందని తనతోపాటు చంద్రబాబు డిఎంకె, ఎజిపి తదితర పార్టీలను కూడా బిజెపి వెనుక సమీకరించాడు. ఆవిధంగా 1996లో వామపక్షాలు నిర్మించిన లౌకిక పక్షాల ఐక్యత చిన్నాభిన్నమై పోయింది. ఇందుకు ఏ ఒక్కరికంటే చంద్రబాబే ఎక్కువ బాధ్యుడు.

1999 అసెంబ్లీ ఎన్నికల నాటివరకే చంద్రబాబు పట్ల ప్రజలలో అసంతృప్తి బాగా పెరిగిపోయింది. అప్పుడు కార్గిల్ ఘర్షణ నేపథ్యంలో రెచ్చగొట్టిన కుహనా దేశభక్తి ఆధారంగా, వాజ్‌పేయి గ్లామర్‌ను అవకాశంగా తీసుకుని ఎడాపెడా వాగ్దానాలు కుమ్మరించి చంద్రబాబు మరోసారి గద్దెక్కాడు. ఆ తర్వాత కాలంలో ఏ ఒక్క సందర్భంలోనూ ఆయన లౌకికతత్వం కోసం నికరంగా నిలబడిన ఉదాహరణే లేదు. ఎన్‌డిఎలో భాగస్వామిగాక పోయినా అందులోని పార్టీలకన్నా బయటనుంచే తెలుగుదేశం ఎక్కువ పాత్ర వహిస్తోందని బిజెపి నేతలు పలుసార్లు కితాబులిచ్చారు. ప్రభుత్వంలో చేరాలని కూడా ఢిల్లీలోని ఆ పార్టీ ప్రముఖులు ఒత్తిడి తెస్తున్నట్టు వార్తలు రాగా చంద్రబాబు దాన్ని ఎత్తుగడల సమస్యగా తోసిపుచ్చాడు. అంతేగాని మతతత్వంతో జట్టుకట్టబోమనే సూత్రబద్ధవైఖరి తీసుకోలేదు. అదే సమయంలో తాను లౌకిక తత్వానికే కట్టుబడి వున్నామని వూరికే చెబుతూ వచ్చారు. గుజరాత్‌లో క్రైస్తవులపై దాడుల తర్వాత మన రాష్ట్రంలో చర్చిలలో ప్రేలుళ్లు సంభవించాయి. చంద్రబాబు ఒక్క క్షణమైనా ఆలోచించకుండా ఇది ఐఎస్‌ఐ పని అని ప్రకటించేశారు. తర్వాత ఆ దిశలో కొన్ని అరెస్టులు కూడా చేసినప్పటికి వివాదాస్పదమే అయ్యింది.

విద్య కాషాయీకరణ చర్యలు మొదలైన కొత్తలో చంద్రబాబు ప్రభుత్వం వాటినుంచి విడగొట్టడానికి ప్రయత్నించింది. కాని తర్వాత దానిపై నోరు మెదపడం మానేసింది. గుజరాత్‌లో జాతిహత్యాకాండను నూటిగా ఖండించలేకపోయింది. ఒక దశలో వాజ్‌పేయి నరేంద్రమోడీని తొలగించాలనుకుంటున్నట్టు వార్తలురావడంతో చంద్రబాబు కూడా అలాటి డిమాండే లేవనెత్తారు. కాని తర్వాత అది నిజం కాదని తేలడంతో ఇరకాటంలో పడ్డారు. నామకార్థంగా నాలుగు రోజులు అటూఇటూ నాటకమాడి, తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలవగానే ముమ్మందుగా అభినందించేందుకు హడావుడి పడ్డారు. ఇదంతా చంద్రబాబు లౌకిక నిబద్ధత ఏ పాటితో తెలియజెప్పింది. హైదరాబాదు ఉపఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని గెలిపించేందుకు చంద్రబాబు రంగంలోకి దిగి జోరుగా పని చేసి భంగపడ్డారు.

బిజెపి పట్ల వున్న వ్యతిరేకత తనకు కొట్టకుండా ముందుగా అసెంబ్లీ ఎన్నికలు జరిపించేసుకుందామనుకున్న ముఖ్యమంత్రి తర్వాత ఆ పాచిక పారకపోయే సరికి 99లో వలె మళ్లీ వాజ్‌పేయి ప్రచారాన్ని ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. అందుకే అద్వానీ రథయాత్రలో పాల్గొనాలా వద్దా అనే తర్జనభర్జనలు తోసిపుచ్చి, నేరుగా పాల్గొని పొగడ్తల వర్షం కురిపించారు. కాషాయకండువా వేసుకుని మురిసిపోయారు. అద్వానీ రథయాత్రల చరిత్రను కొనియాడారు. అంటే 1990 రథయాత్ర కూడా మంచిదేనని ముఖ్యమంత్రి ఉద్దేశ్యమనుకోవాలి. తెలుగుదేశం లౌకిక ప్రాతిపదికను ఇంతకంటే మచ్చ మరోటి వుండదు. పైగా ఈసారి గెలిస్తే ప్రభుత్వంలో చేరే విషయం పరిశీలిస్తామని కూడా హామీ ఇచ్చారు.

అధికారం తప్ప వేరే విలువలు లేకపోయిన తర్వాత ఇలాటి పోకడలు సర్వసాధారణమే. మార్కెట్ తత్వానికి వున్న బ్రహ్మముడి ఎన్నో సందర్భాల్లో రుజువైంది. అంతర్జాతీయ అనుభవాలు చూసినా ప్రపంచీకరణ తాకిడిలో ప్రగతి నిరోధకత్వం పెద్ద పాత్ర వహిస్తుంది. ఈ రెంటికీ అవినాభావ సంబంధం ఉంది. మరి ప్రపంచ బ్యాంకు ముద్దుబిడ్డలు లేదా నమ్మకస్తులైన ఏజెంట్లుగా చంద్రబాబు వంటివారు ఇంకో విధంగా వ్యవహరించడం ఎలా సాధ్యం ? ఇప్పటికే అనేక విధాల అశాస్త్రీయమైన పద్ధతులకు మూఢవిశ్వాసాలకు పీఠం వేసిన చంద్రబాబు అవసరమైతే నేరుగా మతాన్ని వాడుకోవడానికి కూడా వెనుకాడకపోవచ్చు. అందుకే వారు బిజెపి పంచనచేరడం, తమ ప్రజావ్యతిరేక విధానాలపై పెల్లుబికే అసంతృప్తిని ఎదుర్కోవడానికి మతాన్ని రెచ్చగొట్టడం మంచి మార్గమని వారు భావించినా ఆశ్చర్యపోనవసరం లేదు. ○

వీక్షణంలో ప్రచురణ నిమిత్తం సమకాలిన రాజకీయార్థిక విషయాలపై విమర్శలను, విశ్లేషణలను పంపించండి. వ్యాపార దృక్పథానికి దూరంగా ఉంటూ కేవలం పాఠకుల ఆదరణ, చందాదారులు, విరాళదాతల ప్రోత్సాహంతో వెలువడుతున్న ఈ 'వీక్షణం' పక్షపత్రిక, మీది మనందరిది. ఎప్పటికప్పుడు నాణ్యమైన రచనలతో సునిశితమైన విమర్శలతో, ఉపయుక్తమైన సూచనల ద్వారా మరింతగా పత్రిక ఔన్నత్యానికి ప్రగతికి తోడ్పడగలరని ఆశిస్తున్నాం.

– సం

చమురు క్షేత్రాలను కబళిస్తున్న ప్రైవేటు సంస్థలు

- స్వదేశ్ దేవ్‌రాయ్

ప్రత్యేకించి భారత్ వంటి వర్ధమాన దేశాలలో చమురు రంగాన్ని బహుళజాతి సంస్థలు ఏవిధంగా కబళిస్తున్నదీ మనం గమనించవలసి వుంది. ఇరాక్‌ను ఆక్రమించటంలో అమెరికాకున్న అసలు ఉద్దేశాలను యావత్ప్రపంచమూ ముక్తకంఠంతో ఖండించింది. ఇరాక్ చమురును కొల్లగొట్టటమే అమెరికా అసలు వుద్దేశం.

హెచ్.పి.సి.ఎల్., బి.పి.సి.ఎల్. సంస్థలను వేలంలో పెడితే దానికి ప్రభుత్వరంగ సంస్థలు దూరంగా వుండాలంటూ ఆంక్షలు విధించటం మరీ దుర్మార్గం. ప్రభుత్వరంగ సంస్థలు లేనిపక్షంలో ప్రైవేటుసంస్థలు బృందాలుగా ఏర్పడుతాయి. ఒకసారిగాని యీ బృందాలు వునికిలోకివస్తే అవి ప్రభుత్వరంగ సంస్థలను కబళించివేస్తాయి.

ప్రభుత్వరంగంపట్ల ప్రభుత్వం చేపడుతున్న యిలాంటి వైఖరి విషయంలో కార్మికోద్యమం మెలకువతో వుండాలి. రిలయెన్స్ పరిశ్రమను భారీసంస్థగా మార్చేటందుకుగాను బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తప్పుడు మార్గాలలో ప్రయత్నాలు చేస్తున్నది.

ప్రభుత్వరంగంలోని మరో బృహత్తరమైన సంస్థ అయిన ఐఓసిని కూడా ప్రయివేటీకరణ భూతం వెన్నాడుతున్నది. ప్రభుత్వ విధానాల కారణంగా ఐఓసి కూడా ఒఎన్‌జిసి వలెనే ఒడుదుడుకులను ఎదుర్కొంటున్నది. నియంత్రిత ధరల యంత్రాంగాన్ని విచ్ఛిన్నం చేయడంతోపాటు, రాజకీయంగా ఒత్తిళ్ళు పెరుగుతుండటంతో ఐఓసికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సమర్థవంతమైన నిర్వహణ

ఆర్థిక నిర్వహణలో ఒఎన్‌జిసి అత్యున్నత స్థాయిలో వున్నది. 2002 ద్వితీయార్థంలో లాభాలు 84 శాతం పెరిగి రు.2593 కోట్లకు చేరాయి. టర్నోవర్ 35శాతం పెరిగి రూ.7588 కోట్లకు చేరింది. 170 శాతం తాత్కాలిక డివిడెండ్‌ను ప్రకటించి మొత్తం రూ.2424 కోట్లను చెల్లించింది. 2002 ఏప్రిల్ - డిసెంబర్ మధ్యకాలంలో ఒఎన్‌జిసి ఆదాయం 34 శాతం పెరిగి రూ.23,798 కోట్లకు చేరుకున్నది. కాగా నికర లాభం 50శాతానికి అంటే రూ.6,851 కోట్లకు పెరిగింది.

పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలో సైతం చమురు కంపెనీలద్వారా ప్రభుత్వానికి భారీమొత్తాలు సమకూరాయి. 1991-2000 మధ్య పెట్టుబడుల ఉపసంహరణలద్వారా మొత్తం రూ.26,148 కోట్లు లభించాయని పెట్రోలియం- రసాయనాల మంత్రిత్వశాఖ స్థాయీ సంఘం తన నివేదికలో తెలిపింది. ఈ మొత్తంలో 49శాతం, అంటే రూ.12,867 కోట్ల చమురురంగం నుంచి సమకూరినట్లు ఈ నివేదిక తెలిపింది. కేవలం 1998-2000 కాలంలోనే చమురు రంగంద్వారా రూ.7217 కోట్లు సమకూరింది. ఈ కాలంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సమకూరిన మొత్తం రూ.9070 కోట్లు కావటం గమనార్హం.

చమురురంగంలోని రెండు భారీ సంస్థల (హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్) ఆర్థిక నిర్వహణ అత్యంత సమర్థంగా వున్నది. కొన్ని సంవత్సరాలుగా బిపిసిఎల్ టర్నోవర్ రూ.42,294 కోట్లుగా వున్నది. ఎక్సైజు సుంకం క్రింద రూ.10,513 కోట్లను చెల్లిస్తున్నది. కాగా హెచ్‌పిసిఎల్ టర్నోవర్ రూ.45,286 కోట్లుగా వున్నది. ఇది ఎక్సైజు సుంకం క్రింద, రూ.11,246 కోట్లను ప్రభుత్వానికి చెల్లిస్తున్నది. ఆ రకంగా రెండింటి మొత్తం టర్నోవర్, అవి చెల్లించే ఎక్సైజు సుంకం వరుసగా రూ.87,580 కోట్లు, రూ.21,759 కోట్లుగా వున్నది.

ఈ సందర్భంగానే ప్రయివేటురంగం నుంచి కూడా ఉదాహరణను చూపవలసి వుంది. పైన తెలిపిన కాలంలోనే రిలయెన్స్, గ్రాసిమ్, బజాజ్ ఆటో, టాటాస్టీల్, స్టెరిలైట్, పామోలివ్, ఎల్ అండ్ టి, రేమాండ్స్, గ్లాక్సో కంపెనీల మొత్తం టర్నోవర్ రూ. 88,157 కోట్లుగా వున్నది. కాగా ఇవి అన్నీ కలిపి చెల్లించిన ఎక్సైజు సుంకం కేవలం రూ.6,840 కోట్లు మాత్రమే. లాభాలనార్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించటంవలన జాతీయ కోశాగారంపై పడే ఆర్థికభారమేమిటో పై అంకెలు తెలుపుతున్నాయి.

గత ఏడాది బిపిసిఎల్ నికరలాభం రూ.850 కోట్లుగా వున్నది. దాని స్థిరాస్తుల విలువ రూ.9722 కోట్లుగా వున్నది. కాగా హెచ్‌పిసిఎల్ స్థిరాస్తులు రూ.10,224 కోట్లుగా వున్నది. నగదు నిల్వల విషయానికి వస్తే బిపిసిఎల్‌కు రూ.3700కోట్లు, హెచ్‌పిసిఎల్‌కు రూ.5946కోట్లు వున్నాయి.

1991-92లో బిపిసిఎల్ నికర లాభం రూ.148.46

(మిగతా 13వ పేజీలో)

ఓటరు వివేకానికి ఇది కీలక సమయం

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పక్షాలు సన్నద్ధం అవుతున్నాయి. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడంలో చంద్రబాబు ప్రభుత్వం దేశంలోనే ప్రప్రథమ స్థానంలో వున్నట్లుగా, ఈ అభివృద్ధిని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నట్లుగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రచారం చేస్తూ ఉంది. గత 8 సంవత్సరాలుగా అధికారంలో వున్న చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, అభివృద్ధి పథకాలు సామాన్య ప్రజల జీవితాలను దుర్భరంగా మార్చివేశాయి. అనునిత్యం మన కళ్ళెదుట దృశ్యాలు - ఉద్యోగాల నుండి తొలగింపబడ్డ ప్రజలు, శవాలుగా మారిన రైతాంగం, మెడచుట్టూ ఉరితాడు బిగించబడ్డ చేనేత కార్మికులు, మూతపడిన పరిశ్రమలు, వ్యవసాయపు పనులు లేక వేలసంఖ్యలో పట్నాలకు వలస పోతున్న రైతుకూలీలు, వరకట్నపు చావులకు, లైంగిక అత్యాచారాలకు బలి అవుతున్న మహిళలు, అభద్రతతో బతుకుతున్న మైనారిటీలు, ఆధిపత్య కులాల దాడులకు గురవుతున్న దళితులు, అడవిపై హక్కును, భూములను కోల్పోయి తరిమివేయబడుతున్న గిరిజనులు. 'అభివృద్ధి' పేరిట ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆర్థిక సంస్కరణలు సామాన్య ప్రజల జీవితాలను సర్వనాశనం చేయడమే కాకుండా, రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభపు సుడిగుండంలోకి నెట్టివేశాయి. చంద్రబాబు ప్రభుత్వపు అభివృద్ధి వ్యూహపు లక్షణాలను, లక్ష్యాలను, అవి సాధించిన ఫలితాలను సమీక్షించుకోవాల్సిన, రానున్న ఎన్నికలలో విచక్షణతో వ్యవహరించవలసిన బాధ్యత పౌరులుగా మనపై ఉంది.

అంతర్జాతీయ ద్రవ్య సంస్థలైన ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్ వంటి వాటి నేతృత్వంలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ కొనసాగుతున్న 'అభివృద్ధి'కి ఆర్థిక సంస్కరణలు అనే పదం పర్యాయపదంగా మారింది. ఏ రకమైన అభివృద్ధికైనా సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలే అంతిమ పరిష్కారాలుగా చెప్పబడుతున్నాయి. ఐఎమ్ఎఫ్, ప్రపంచబ్యాంకు రూపొందించిన సూచనల నుండి, చంద్రబాబు ప్రభుత్వ విధానాలను వేరుచేసి చూడటం అసాధ్యమైంది. గత తొమ్మిదేళ్ళ పాలన దీనినే రుజువు చేస్తున్నది. ప్రపంచబ్యాంకు తన విధానాల అమలుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రయోగశాలగా ఎన్నుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రు.12,000 కోట్ల షరతులతో కూడిన రుణాలను ప్రపంచబ్యాంకు నుండి, ఇతర సంస్థల నుండి తీసుకుంది. ఈ షరతులతో భాగంగానే వ్యవసాయ రంగంలో ఇస్తున్న సబ్సిడీల తగ్గింపు, విదేశీ పెట్టుబడులు, దిగుమతులపై ఆంక్షల తొలగింపు, వివిధ రూపాలలో పన్నుల పెంపకం, విద్యుత్తు, నీరు, వైద్యం, విద్యవంటి మౌలిక, సేవా రంగాలను ప్రైవేటీకరించడం, ప్రభుత్వరంగ సంస్థల మూసివేత, ఉపాధి కల్పన అవకాశాలను కుదించడం కాంట్రాక్టు కార్మికుల విధానాన్ని ముందుకు తేవటం, కార్పొరేట్ వ్యవసాయం, వంటి చర్యలను తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టింది. స్వేచ్ఛా వాణిజ్య విధానాలకు అనుగుణమైన, ప్రపంచీకరణకు అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. మన రాష్ట్రంలో అమలు పరిచేందుకు సూచించిన "ఎజెండా ఫర్ ఎకనామిక్ రిఫామ్స్"ని రూపొందించింది ప్రపంచబ్యాంకే. ఈ క్రమంలో ముందుకు వచ్చినవే విజన్ 2020, ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక సంస్కరణలు, నూతన వ్యవసాయ విధానం, స్వర్ణాంధ్రప్రదేశ్ పథకాలు, అంతేకాదు, జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత, నీరు-మీరు, వెలుగు, దీపం, చేయూత, ఆదరణ, డ్వాక్రా గ్రూపులు, నీటిసంఘాలు, కోటి వరాలు, విద్యా కమిటీలు వంటి పూటకో పథకం ప్రజలను పంచించేందుకు, ఆర్థిక సంస్కరణల క్రమాన్ని వేగవంతం చేసేందుకు ప్రవేశపెట్టబడ్డవి మాత్రమేనని గుర్తించాలి. ఈ పదేళ్ళ కాలంలో స్వర్ణాంధ్రప్రదేశ్ ఏమోగానీ, ఈ రాష్ట్రం "ఋణాంధ్రప్రదేశ్"గా మారింది. 2003-2004 ఆఖరుకల్లా రాష్ట్ర రుణభారం రు.57,000 కోట్లు, దీనిపై వడ్డీ చెల్లింపు రు.6,000 కోట్లకు పైగా చేరుకుంటున్నది. ఈ భారం చాలదన్నట్లు, చంద్రబాబు ప్రభుత్వం రెండవ విడత ఆర్థిక సంస్కరణల అమలు కోసం ఇటీవలే ప్రపంచబ్యాంకు నుండి షరతులతో కూడిన మరో 240 మిలియన్ డాలర్లను అప్పుగా తీసుకుంది. టిడిపి ప్రభుత్వం ఎంతో ఘనంగా చెబుతున్న ఇంతటి అభివృద్ధి తరువాత కూడా, కూడు, గుడ్డ, నీడవంటి కనీస అవసరాలైనా తీరకుండా దరిద్రరేఖకు దిగువ జీవిస్తున్న ప్రజలు మన రాష్ట్రంలో కోటి ఇరవై లక్షలున్నారు. బాలకార్మికులు, శిశుమరణాల్లో, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. అక్షరాస్యత రేటులో 22వ స్థానంలోనూ, మౌలిక సదుపాయాల కల్పనలో 10వ స్థానంలోనూ మన రాష్ట్రం ఉంది. చంద్రబాబు ప్రభుత్వ విధానాలు రాష్ట్రాభివృద్ధిని అధఃపాతాళానికి నెడుతూ ప్రజల జీవితాల్ని ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టివేశాయి. ప్రపంచబ్యాంకు కనుసన్నలలో నడుస్తున్న తెలుగుదేశం ప్రభుత్వపు అభివృద్ధి వ్యూహం ప్రజా వ్యతిరేకమైందనీ, రైతులు, కార్మికులు, మైనారిటీలు, దళితులు,

మహిళలు, వివిధ సెక్షన్‌లకు చెందిన ప్రజానీకం, దీనిని తిరస్కరించాల్సిన అవసరమెంతో ఉంది. ఈ విధానాలు ప్రజల ప్రజాస్వామిక విలువలపైన, సార్వభౌమత్వంపైన జరుగుతున్న దాడికి నిదర్శనం ప్రపంచీకరణ అన్నది సామ్రాజ్యవాదానికి మరోపేరు. అది తన విధానాల అమలుకు అనువైన ఏజెంటును చంద్రబాబు రూపంలో కనుగొన్నది. ఈ నేపథ్యంలో మరోసారి చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలను పాలించే అవకాశాన్ని రాష్ట్ర ప్రజలు పునఃసమీక్షించాలి.

పేదరికం, కరువు, నిరుద్యోగం, భూమిసమస్య, సాగు, త్రాగునీటి సమస్యలు, ప్రాంతీయ అసమానతలు, ఫ్యాక్టరీల మూసివేత, ఆకలి చావులు, ఆత్మహత్యలు, వలసలు, వ్యవసాయ రంగంలో సంక్షోభం, మద్యపానం, మతతత్వం, కుల అణచివేత, పౌరహక్కుల అణచివేత, స్త్రీలపై అత్యాచారాలు, అసమానతలు ఇలా అసంఖ్యాక సమస్యలని రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటూవుంటే, ఈ సమస్యల పరిష్కారానికై గత 9 సం॥లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం చేసింది ఏమిటో అడగాల్సిన అవసరం ఓటర్లపై ఉంది. దీంతో ఇన్నేళ్ళుగా ప్రజల సమస్యలు అపరిష్కృతంగా వుండటానికి, రాష్ట్రంలో అభివృద్ధికి జరగపోవడానికి కారణం చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ విధానాలేనని గ్రహించడానికి కనీస జ్ఞానం సరిపోతుంది.

ఇదిలా ఉంటే, ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టుపెట్టిన చంద్రబాబు ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల అమలుకు ఎంతటి నిర్బంధపూరిత చర్యలను చేపట్టడానికైనా వెనుదీయడం లేదు. దుర్భరంగా మారిన తమ జీవన పరిస్థితుల్లో మార్పుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఈనాడు వివిధ సెక్షన్‌లో ప్రజానీకం ఉద్యమిస్తున్నారు, ఎదురుకాల్పుల హత్యలు, లాకప్ చిత్రహింసలు, అక్రమకేసుల బనాయింపు, నల్లచట్టాల ప్రయోగం మొదలగు నిర్బంధ విధానాలు తెలుగుదేశం పాలనలో సర్వసాధారణమయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న పౌర, ప్రజాస్వామిక హక్కుల అణచివేతను అడ్డుకోకపోతే, రానున్న కాలంలో ప్రజలపై మరింత నిర్బంధం పెరిగే ప్రమాదం ఎంతైనా ఉంది.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండీ ఈ దేశంలో హిందూ మతోన్మాదం మైనారిటీలు, దళితులు, గిరిజనులపై అత్యంత హేయమైన పద్ధతులలో దాడులకు పాల్పడుతున్నది. గుజరాత్‌తో సహా దేశవ్యాప్తంగా బిజెపి దాని అనుబంధ సంస్థలు మారణకాండను సృష్టించాయి. ఇటువంటి హిందూమతోన్మాద శక్తులతో తెలుగుదేశం ప్రభుత్వం పెనవేసుకుని వుంది. చంద్రబాబు విధానాలను సమర్థిస్తూ, అతడి అడుగుజాడల్లోనే నేడు ఎన్‌డిఎ ప్రభుత్వం "అభివృద్ధిని" తమ లక్ష్యంగా పేర్కొంటున్నది. 4000 కోట్ల రూ॥ల ప్రజాధనాన్ని వెచ్చిస్తూ బిజెపి ప్రభుత్వం "ఫీల్‌గుడ్" అంశాన్నీ "ఇండియా ఈజ్ షైనింగ్" అనే ప్రచారాన్ని చేపట్టింది. ప్రపంచీకరణ క్రమాన్ని వేగవంతంగా, దేశవ్యాప్తంగా అమలు పరిచేందుకు మతోన్మాదాన్ని మరోమారు రథయాత్రల పేర రెచ్చగొట్టేందుకు, ప్రపంచీకరణ విధానాల అమలుకు సన్నద్ధం అవుతున్న హిందూత్వ బిజెపి, దానితో కలిసి అధికారంకై వెంపర్లాడుతున్న టిడిపి, తదితర అవకాశవాద రాజకీయ సంస్థల పట్ల ఎంతో అప్రమత్తత అవసరం. ❍

(11వ పేజీ తరువాయి)

చమురు క్షేత్రాలను కబళిస్తున్న ప్రైవేటు సంస్థలు

కోట్లు కాగా పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించినది రూ. 1876 కోట్లు వున్నది. 2001-02లో ఈ సంస్థ తన లాభాలను రూ.835 కోట్లకు పెంచుకొని ప్రభుత్వానికి పన్నులక్రింద రూ.10,513 కోట్లను చెల్లించింది.

సమైక్యతను విస్తృతపరచాలి

ప్రయివేటీకరణ దాడిని పెద్దఎత్తున ఎదుర్కొంటున్న ప్రభుత్వరంగ సంస్థలు గత సంవత్సరం మే 21న జరిగిన సార్వత్రిక సమ్మెలో ఉత్సాహంగా పాల్గొన్నాయి. బొగ్గు, చమురు, విద్యుత్, ఎరువులు, కమ్యూనికేషన్స్, నాల్కో బ్యాంకులు, ఇన్సూరెన్స్ వంటివి వీటిల్లో వున్నాయి.

బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థలలో మూడు రోజులపాటు జరిగిన సమ్మె కూడా ప్రయివేటీకరణ వ్యతిరేక శక్తులలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది.

అయితే దేశవ్యాప్త నిరసన నుంచి పాఠాలు నేర్చుకొనే ఆసక్తి ప్రభుత్వంలో లేదు. పార్లమెంట్‌లో విన్పించిన నిరసన గళాలకు కూడా అది ప్రాధాన్యతనివ్వటంలేదు. ఇక్కడ ఒక అంశాన్ని గమనంలో వుంచుకోవాలి. అరుణ్‌శౌరి చూపిన అత్యుత్సాహం వాస్తవ రూపాన్ని దాల్చివున్నట్లయితే బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థలు ఈపాటికి ప్రైవేటుపరమై వుండేవి. అయితే వీటిని త్వరలోనే ప్రైవేటీకరించాలన్నది ఈ ప్రభుత్వ పన్నాగంగా వున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.

ఈ పూర్వరంగంలో కొల్‌కతా సదస్సు కార్మికుల ఐక్యతకు మరింత విస్తృత పునాదిని ఏర్పరిచింది. ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమ పటిష్టతకు బీజాలు వేసింది. ❍

వ్యవసాయరంగానికి తగ్గిన పెట్టుబడులు

- వి. హనుమంతరావు

పిండి లేకుండా రొట్టె తయారవుతుందా? తయారవుతుందంటారు మన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి చంద్రబాబు. రాష్ట్రంలో పెట్టుబడులు తగ్గిపోతుంటే అభివృద్ధి సాధించేశానంటున్నారు. పెట్టుబడుల ధోరణి ఎలా వుందో ఆంధ్ర, కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులు ప్రభుత్వ గణాంకాలను విశ్లేషించి వెలిబుచ్చిన ఫలితాలను చూద్దాం.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఎకనామిక్ విభాగం ప్రొఫెసర్ కె.సి.రెడ్డి, సెస్ సంస్థలో ప్రొఫెసర్ ఎస్. సుబ్రమణ్యం చేసిన విశ్లేషణ ప్రకారం స్థూల, స్థిర పెట్టుబడి formation (పెట్టుబడి అంశం) పెరుగుదల దేశంలో, రాష్ట్రంలో 5.8 శాతంగా వున్నా, రాష్ట్రంలో తలసరి ఆదాయానికి, దేశంలో ఆదాయానికి మధ్యనున్న వ్యత్యాసాన్ని తొలగించడానికి, ఈ పెరుగుదల చాలదని అంటున్నారు. జాతీయ స్థాయితో పెట్టుబడుల పెరుగుదల రేటు కన్నా, ఆంధ్రప్రదేశ్‌లో 90వ దశకంలో తక్కువగా ఉంది. వ్యవసాయరంగంలో పెట్టుబడుల పెరుగుదల రేటు 80వ దశకంలో 6.9 శాతం నుంచి 90వ దశకంలో 1.1 శాతానికి పడిపోయింది. ద్వితీయ రంగంలో పెట్టుబడులు (మాన్యుఫాక్చరింగ్, మౌలిక సౌకర్యాలు) జాతీయ స్థాయిలో గణనీయమైన పెరుగుదల చూపించగా, రాష్ట్రంలో తరుగుదల నమోదైంది. దీనికి ప్రధాన కారణం మౌలిక సౌకర్యాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవడమే. ఇలా తగ్గటం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. వ్యవసాయం, విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీరు, నిర్మాణరంగాల్లో పెట్టుబడుల పెరుగుదల నత్తనడకగా సాగటమే దీనికి కారణం. రాష్ట్రంలో పెట్టుబడులు 80, 90 దశకాల్లో పెరుగుదలను సూచించగా వ్యవసాయ రంగంలో, రెండు సంవత్సరాలు తప్ప మొత్తం 90వ దశకంలో పెరుగుదల సాదాసీదాగా వుంది.

మొత్తం రెండు దశాబ్దాల గణాంకాలను పరిశీలిస్తే 86-87 వరకూ పెట్టుబడుల పెరుగుదల వేగంగా వుండగా, అప్పటి నుంచి 91-92 వరకు స్థిరంగా ఉండి, 96-97 వరకూ చాలా వేగంగా పడిపోయి, దశాబ్దపు ఆఖరి సంవత్సరాల్లో మళ్లీ పెరిగింది. అయితే ఇందులో ప్రభుత్వరంగం వాటా తగ్గింది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు తగ్గి ప్రైవేటు పెట్టుబడులు పెరిగాయి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు 90వ దశకంలో 7 శాతం నుండి 3.6 శాతానికి పడిపోగా, ప్రైవేటు రంగంలో పెట్టుబడులు 5.2 శాతం నుండి -1.7 శాతానికి పడిపోయాయి. పెట్టిన కాస్త పెట్టుబడి అతిముఖ్యమైన నీటిపారుదల రంగంలో పెట్టకపోవడం వలన కాలువల కింద నీటిపారుదల విస్తీర్ణం రెండు లక్షల హెక్టార్లు తగ్గింది. అంతకుముందు దశాబ్దాలన్నింటిలో నీటిపారుదల మీద పెట్టుబడులు పెరుగుతూనే వచ్చాయి.

నికర రాష్ట్రాదాయంలో పెట్టుబడుల రేషియో 80వ దశకం మధ్యంతరం వరకూ బాగానే పెరిగి, 90 దశాబ్దం ప్రారంభ సంవత్సరాల వరకూ నిలకడగా వుంది, ఆ తర్వాత 92-93 నుంచి రేషియో తగ్గుతూ వచ్చింది. ఇది వ్యవసాయ రంగంలో స్పష్టంగా కనిపిస్తుంది. 82-83/87-88 మధ్యకాలంలో 21.2 నుంచి 30.9 శాతం వరకూ పెరిగి 97-98 వచ్చేసరికి కేవలం 11.2 శాతానికి దిగజారింది. మాన్యుఫాక్చరింగ్ రంగంలో కూడా అదే ధోరణివ కనిపించింది. దీని అర్థం ఏమిటంటే సొంత నిధులనుంచి పెట్టుబడులు తగ్గుతూ రావటమే. సహజంగానే ఇది అప్పుల ఊబిలో దిగడానికే దారితీసింది.

వ్యవసాయంలో పెట్టుబడులు

కేంద్ర గణాంక శాఖ సేకరించిన వ్యవసాయ గణాంకాల ప్రకారం దేశంలోనే 1950-51 నుంచి 1980-81 వరకూ ప్రభుత్వ పెట్టుబడులు పెరుగుతూ వచ్చి, ఆ తర్వాత తగ్గుతూ వచ్చాయి. సరిగ్గా ఎపుడైతే శ్రీమతి గాంధి, అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణం తీసుకున్నదో, అప్పటి నుంచయితే ప్రైవేటు రంగానికి పెద్దపీట వేయటం ప్రారంభమైందో అప్పటినుండే వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గటం ప్రారంభమైనదనే విషయం గమనార్హం. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఈ పెట్టుబడులు ధోరణులను రమేష్‌చంద్ సేకరించి విశ్లేషించారు. ఈ సమాచారంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ధోరణులను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్థికశాఖలో ప్రొఫెసర్ సి.రత్నం, రీసెర్చ్ స్కాలర్ కె.పద్మజ వివరంగా పరిశీలించారు. ఈ పరిశీలన ప్రకారం 80-81 స్థిరధరల్లో వ్యవసాయం తత్సంబంధిత రంగాల్లో పెట్టుబడులు అయిదవ ప్రణాళికలో సంవత్సరానికి రు.202 కోట్ల నుంచి 90-91, 91-92 వార్షిక ప్రణాళికల కాలానికి రు.125 కోట్లకు పడిపోయినా, ఎనిమిదవ ప్రణాళికలో రు.181 కోట్లకు పెరిగాయి. అయినా కూడా అయిదవ

ప్రణాళికా కాలంనాటి స్థాయికి చేరుకోలేకపోయాయి. స్థిర ధరల ప్రకారం హెక్టారు పంట భూమిమీద పెట్టుబడులు కూడా అవే ధోరణిని చూపించాయి. 1974-75 నుంచి 1996-97 మధ్యకాలంలో హెక్టారుకు పెట్టుబడి ఖర్చు రు.160లు. ఈ కాలంలో హెక్టారు మీద పెట్టుబడి ఖర్చు ప్రతీ సంవత్సరం 0.78 శాతం చొప్పున తగ్గుతూ వచ్చాయి. పంట కార్యక్రమాలు, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి కోసం రెండవ ప్రణాళిక మొత్తం ఖర్చులో 58.36 శాతం ఖర్చుచేయగా, మూడవ ప్రణాళికలో 65.29 శాతం, 1966-69 మధ్య వార్షిక ప్రణాళికల కాలంలో 79.94 శాతం ఖర్చు చేయటం జరిగింది. ఆరవ ప్రణాళిక నాటికి ఈ శాతం తగ్గి, మళ్లా పెరిగింది. విద్యుత్‌రంగానికి కేటాయింపు పెరగటం వల్ల ఈ పెరుగుదల సాధ్యమైంది. అయితే వ్యవసాయం కోసం విద్యుచ్ఛక్తి మీద ఖర్చు పాక్షికంగానే వుంటుందని గుర్తుంచుకోవాలి. ఇలా విద్యుచ్ఛక్తి మీద ఖర్చు పెరిగి, పంట కార్యక్రమాలు, నీటిపారుదల కోసం ఖర్చు తగ్గిందంటే రైతులు తమ సొంత పెట్టుబడిలో బోరుబావుల మీద ఆధారపడటం వల్లనే అని గమనించాలి. అంటే ప్రభుత్వ రంగంలో ఖర్చు తగ్గిందన్నమాట. పంట కార్యక్రమాల్లో ఆయకట్టు అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తి అతి ముఖ్యమైన విషయాలు. కాని అన్ని ప్రణాళికల్లో (ఒకటి రెండు సంవత్సరాలు తప్ప) కేటాయింపులు పూర్తిగా ఖర్చు కాలేదు. అలాగే పరిశోధన విస్తరణ కార్యక్రమాలకు నిధులు నామకః కేటాయింపులు జరిగాయి. పశుపోషణ, పాల ఉత్పత్తి మీద ఖర్చు రెండవ ప్రణాళిక మొత్తం ఖర్చు 1.43 శాతం నుంచి, ఎనిమిదవ ప్రణాళికలో 0.24 శాతానికి దిగజారింది. చేపల పెంపకం మీద పెట్టుబడుల ఖర్చు అన్ని ప్రణాళికల్లో మొత్తం ప్రణాళిక ఖర్చులో 0.20 నుంచి 0.5 శాతం ఖర్చు చేయగా, ఎనిమిదవ ప్రణాళికలో 0.12 శాతానికే తగ్గిపోయింది. 1993 నుంచి అడవుల పెంపకం కోసం అదనపు నిధుల కేటాయింపు జరిగిందంటే, అది ప్రపంచ బ్యాంకు రుణం అందుబాటులోకి రావటం వల్లనే సాధ్యమైంది.

మొత్తం మీద చూచినపుడు ఎనభయ్యవ దశకంలో వ్యవసాయం, తత్సంబంధిత రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గాయి. ఎనిమిదవ ప్రణాళికా కాలంలో (92-93/96-97) పెరిగినా, అది నామమాత్రమే. ప్రైవేటు రంగంలో పెట్టుబడులు ఈ కాలం అంతటిలోనూ పెరుగుతూ వచ్చినా, ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల తగ్గుదలను పూడ్చలేకపోయాయి. విద్యుచ్ఛక్తి రంగంలో పెట్టుబడుల పెరుగుదల, పంట కార్యక్రమాలు నీటిపారుదలల మీద తగ్గుదల ప్రధాన ధోరణిగా వ్యక్తమైంది. ఇలా తగ్గటం వల్ల 1980-2000 మధ్యకాలంలో కాల్వల కింద 0.30 శాతం, చెరువుల కింద 2.15 శాతం తగ్గి బోరుబావుల కింద నీటిపారుదల విస్తీర్ణం ప్రతి సంవత్సరం 10.51 శాతం చొప్పున పెరిగింది. పరిశోధన, విస్తరణ మీద ఖర్చు తక్కువగానే జరిగింది. ఇందువల్ల, 90వ దశకంలో అనేక పంటల ఉత్పత్తి పెరుగుదల నిలిచిపోయింది. పెరుగుదల రేటు వెనుకపట్టు పట్టింది. పశుపోషణ, పాల ఉత్పత్తి, చేపల పెంపకం, అడవుల మీద ఖర్చు మొత్తం ప్రణాళిక ఖర్చులో శాతంగా, స్థూల రాష్ట్రాదాయంలో శాతంగా తగ్గింది.

(దీనికి సంబంధించిన పట్టికలు 'రెండురెళ్ళు నాలుగు' శీర్షికన ఇవ్వడం జరిగింది. గమనించగలరు - సం.)

వీక్షణం పాఠకులకు, చందాదారులకు విజ్ఞప్తి

'వీక్షణం' పాత చందాదారులు తమ చందాను పునరుద్ధరించదలుచుకున్నట్లయితే 140 రూపాయలను మనియార్డరు ద్వారా గాని లేదా 'సమతా పబ్లికేషన్స్' పేర డి.డి. తీసిగాని పంపాలి. తమ అడ్రస్సు పక్కన గల నెంబరును తప్పకుండా తెలియచేయవలసి ఉంటుంది.

కొందరు కొత్తగా చేరుతున్న చందాదారులు మనియార్డరు వెనుక భాగంలో గల అడ్రస్సు కాలంలో అడ్రస్సు రాయడం మరచిపోతున్నారు. వారి డబ్బు అందినప్పటికి అడ్రస్సు లేని కారణంగా పత్రిక పంపించడం సాధ్యం కాదు కాబట్టి ఆ విధంగా చందాకట్టి పత్రిక రానట్లయితే అడ్రస్సును స్పష్టంగా పోస్టుకార్డుపై రాసి తెలియపరచగలరు.

గత సంవత్సరం చందాదారులు కొందరు తమ చందాలను పునరుద్ధరించుకోనప్పటికి వీక్షణం అభిమానులుగా ఎంచి వారికి పత్రికను పంపించడం జరుగుతుంది. అలాంటి వారు తమ చందాను వీలైనంత తొందరగా అందచేస్తారని ఆశిస్తున్నాం.

- సం

పర్యావరణం -5

కబ్జాల నుంచి కాలుష్యం నుంచి కొల్లేరును కాపాడుదాం

కొంగను చూస్తే కొల్లేరు గుర్తుకు వస్తుంది. కానీ నేడక్కడ కొంగలూ లేవు. కొల్లేరు లేదు! కొల్లేటి కొంగ చేపను మింగినంత సులభంగా కబ్జాదారులు కొల్లేటిని మింగేశారు. జీవకోటికి ప్రాణాధారమైన నీటిని సైతం నిర్జీవం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సయిన మన కొల్లేరు మనది కాకుండా పోతోంది. మానవాళికీ, పర్యావరణానికీ ఎంతో ఉపకరించిన ఈ సరస్సు అక్రమణలమయం అవుతోంది. వలస పక్షుల విడిదిగా పరిఢవిల్లిన మన కృష్ణా, గోదావరీ పరీవాహక ప్రాంతాల కొల్లేరు నేడు సహజత్వం కోల్పోయి ప్రమాదంలో పడింది.

అమూల్యమైన ఇలాంటి సరస్సులను సంరక్షించడానికి నవంబర్ 2002లో ఇరాన్‌లోని రంసార్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సు కొల్లేరు సంరక్షణావసరాన్ని గుర్తించింది. వర్షాధార సరస్సయిన కొల్లేరు సుమారు 90,100 హెక్టార్ల మేర వ్యాపించి ఉన్న అతిపెద్ద సరస్సు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తొమ్మిది మండలాల్లో ప్రజలకు సాగునీటిని, తాగునీటిని ఇస్తోంది. పది కాంటూర్లు (అడ్డగట్లు)గా విభజన జరిగిన కొల్లేరులో 30,855 హెక్టార్ల ప్రాంతాన్ని ప్రభుత్వం అభయారణ్యంగా ప్రకటించింది. నేడీ అభయారణ్య ప్రాంతాన్ని గుర్తించడమే దుస్సాధ్యంగా మారింది. కొల్లేరు చేపల చెరువులతో నిండిపోయింది. అశాస్త్రీయ రొయ్యల పెంపకం, వ్యవసాయం, కొల్లేరను వికృతపరిచాయి. కొల్లేటి నీరు పారిశ్రామిక వ్యర్థజలాలతో, ఎరువులూ, పురుగుమందులతో కలుషితమై పోయింది. చేపలు చచ్చిపోవడం, చుట్టుపక్కల ప్రాంతాల్లో, భూగర్భ జలాలు కలుషితం కావడం కొల్లేటి నీటి కాలుష్యపు దుష్ఫలితాలే. ఒకప్పటి ఈ సజీవ జలనిధి మృత్యుసాగరంగా మారిపోవడం శోచనీయం. చాలా చోట్ల ఉప్పునీరు ఇంకడం, తద్వారా చేపలూ, రొయ్యలు మరణించడం మనం చూస్తూనే ఉన్నాం.

"కొల్లేరు అభయారణ్యాన్ని" నోటిఫై చేసి మూడున్నరేళ్ళు కావస్తున్నా ప్రభుత్వం యంత్రాంగం దానిని అమలు చేయడంలో విఫలమైంది. ఈ విషయమై రాష్ట్ర హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టు తన తీర్పును ప్రకటిస్తూ 30 జూన్ 2001న అభయారణ్య ప్రాంతంలో ఎటువంటి రొయ్యల సాగు జరగరాదని ఆదేశించింది. దురాక్రమణలను తొలగించాలంది. గౌరవ హైకోర్టు ఈ ఆదేశాన్నిచ్చి ఏడాదిన్నర కావస్తున్నా అమలుకు పూనుకోకుండా చోద్యం చూస్తోంది. జిల్లా యంత్రాంగం ఆదేశాల అమలుకు నిజాయితీగా ప్రయత్నిస్తే చేపల చెరువుల యజమానుల లాబీ వీటిని నిర్వీర్యపరిచింది.

కొల్లేరులో ప్రభుత్వ, ప్రైవేటు భూములున్నాయి. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయినపుడు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖదే. వన్యప్రాణులను కాపాడటానికి ఉద్దేశించిన అభయారణ్యం దురాక్రమణకు గురయితే అటవీశాఖ రంగంలో దిగాలి. పరస్పర సహకారంతో ఈ శాఖలు పనిచేసి ఆక్రమణదారుల భరతం పట్టాలి. కాని అది జరగడం లేదు. ఇక్కడ ఏదో లొసుగు ఉంది. అటవీశాఖకు చెందిన వన్యప్రాణి విభాగం అక్రమ చేపల చెరువుల యజమానులపై కొన్ని డజన్ల కేసులను పెట్టినా ఒక్క దాన్లోనూ శిక్షపడలేదు. ఎందుచేత? రెవెన్యూ రికార్డులో 'బినామీ' పేర్లతో ఈ చేపల సాగు సాగిపోతూంటుంది. అసలు యజమాని వేరే ఉంటే రికార్డులలో ఏ దళితునిదో, జాలరిదో పేరు ఉంటుంది. లిఖితపూర్వక సాక్ష్యం ఏదీ లేకపోవడంతో కేసు వీగిపోతుంది. ఇదీ కథ.

నోటిఫై చేసిన అభయారణ్య ప్రాంతానికి చట్టబద్ధ యజమానిగా అటవీశాఖను ప్రభుత్వం ప్రకటించాల్సింది. కాని దురదృష్టవశాత్తూ భూములను అటవీశాఖకు బదలాయించడం కానీ 5 కాంటూరు ప్రాంతాన్ని రెవెన్యూ అడంగళ్లలో నమోదు చేయడం కానీ జరగలేదు. కనుకనే ఎస్.సి.లు, చేపల వాళ్ళ పేర్లతో భూములు నమోదై బినామీ తంతులు జరుగుతున్నాయి. వాస్తవానికి "కొల్లేరు అభయారణ్యం" కాగితం మీద తప్ప ఉనికిలో లేదు. అటవీశాఖకు ఆక్రమణదారుల భరతం పట్టే అధికారం లేదు. రెవెన్యూశాఖ మాత్రం ఎస్సీల నుంచి నీటిపన్నును మాత్రం వసూలు చేస్తుంది.

కొల్లేరు ఒక సరస్సు మాత్రమే కాదు. అదొక పర్యావరణ సమతుల్యతను కాపాడే ఒక వ్యవస్థ. దీని నాశనం మానవాళికి పెద్ద ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. సరిదిద్దుకోలేని దుష్ఫలితాన్ని తెచ్చిపెడుతుంది. రొయ్యల ద్వారా సంపాదించే కోట్లకన్నా కొల్లేరు ఉనికిలో ఉండటం తెచ్చే లాభం మిన్న. సమాజాన్నీ, స్థానిక జాలరులనూ, పక్షులూ, జంతువులూలాంటి ప్రాణికోటినీ కాపాడాలంటే కొల్లేరును సంరక్షించుకోవలసిన అవసరం ఉంది. అందుకు మనమంతా నడుంకట్టాలి.

కొల్లేరు నుంచి ఆక్రమణదారులను వెళ్ళగొట్టాలి.

పర్యావరణాన్నీ, ప్రాణికోటినీ రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల అమలుకు పూనుకోవాలి.

(సమృతి సౌజన్యంతో)

గోదావరి ఎత్తిపోతలు - విద్యుత్ సమస్యలు

(గత సంచిక తరువాయి)

- ఎమ్. తిమ్మారెడ్డి

సుమారు 250 నుండి 427 మీటర్ల ఎత్తుకు నీటినీ పంపేందుకు అవసరమయ్యే విద్యుత్ మన రాష్ట్రంలో లభ్యం కానుందా? అన్నది ప్రధాన పరిశీలనాంశం.

ప్రభుత్వపు అంచనా నివేదికల్లో జలవిద్యుత్ కేంద్రాల ఏర్పాటు ద్వారా ఈ పథకానికవసరమయ్యే విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్నది పై పథకం. తక్షణ ఆవశ్యక ఆచరణకు ఇది దోహదపడవు. జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం చేపట్టినా, తక్షణ వినియోగం సాధ్యం కాకపోవచ్చు. ఈ కారణంగా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాల్సి వుంది.

వాస్తవానికి రాష్ట్రం అదనపు విద్యుత్ ఉత్పత్తిని అందించే స్థాయిలో ఉంది. గత కొద్ది సంవత్సరాలుగా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి వినియోగాలను పరిశీలిస్తే ఈ విషయం అవగతమౌతుంది.

	2000-01	2001-02	2002-03
విద్యుత్ ఉత్పాదన	42,628 ఎం.యు	45,413 ఎం.యు	48,482 ఎం.యు
విద్యుత్ వినియోగం	42,189 ఎం.యు	40,788 ఎం.యు	4,333 ఎం.యు

పై గణాంక వివరాలను పరిశీలిస్తే రాష్ట్రంలో విద్యుత్ లభ్యత వినియోగం కన్నా ఎక్కువేనని రూఢవుతుంది. ప్రస్తుత సంవత్సరంలో కూడా (2003-04) విద్యుత్ లభ్యత 49,353 మిలియన్ యూనిట్లు కాగా వినియోగం 44,393 మిలియన్ యూనిట్లని అంచనా. అంటే 5వేల మిలియన్ యూనిట్లకు పైగా మిగులు. యిదివరకు మనం గణించిన అంచనాల మేరకు గోదావరి ఎత్తిపోతల పథకానికి వెయ్యి నుండి 1650 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం. ఈ కారణంగా విద్యుత్ లభ్యతకై మనం కంగారుపడాల్సిన పనేలేదు. గోదావరి ఎత్తిపోతల పథకానికవసరమయ్యే విద్యుత్ మన దగ్గరే లభ్యం కానుంది.

భవిష్యత్‌లో కూడా విద్యుత్ ఈ తీరునే వుండగలదనేందుకు, గత సంవత్సరం ఏప్రిల్ 9న రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి విడుదల చేసిన ఉత్పత్తి అంచనా పథకమే సాక్ష్యం-భరోసా. 2007-08 నాటికి 5,182 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని సాధించగలమని యిందుకనువుగా విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రూపొందించుకోవాల్సిందిగా సూచించింది. గ్రామీణ ప్రాంతాలకు 24 గంటలూ విద్యుత్ సరఫరా, 29 శాతపు విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని ముందస్తు రిజర్వ్‌గా ఉంచేందుకు అనువుగానే ఈ అంచనాలు రూపొందించబడ్డాయి. మరో కోణంలో అయితే, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదార్ల ఒత్తిడి మేరకు విద్యుత్ కొనుగోళ్లకు ట్రాన్స్‌కో మెడలు వంచాల్సి వచ్చింది. యిందుకు సర్కారు మద్దతూ ఉంది. ఫలితంగా రాష్ట్రం రానున్న ఏళ్లలో అదనపు విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

ట్రాన్స్‌కో విద్యుత్ డిమాండు అంచనాలను ఎదుర్కొనేందుకు నియంత్రణా మండలి పలు ప్రైవేటు విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందాలను ఖరారు చేసింది. రాష్ట్ర విద్యుత్ ఉత్పాదనా సంస్థ (జెన్‌కో) చైనా సహకారంతో రాయలసీమ జలవిద్యుత్ కేంద్ర నిర్మాణ ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యిటీవలే ఈ నిర్మాణ ఒప్పందాలను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ (భెల్) వారికి మార్చడం జరిగింది.

రెగ్యులేటరీ కమీషన్ ఆమోదించిన విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందాలు

కంపెనీ	సామర్థ్యం (ఎమ్.డబ్ల్యు)	అమలు
బిపిఎల్	520 మెగావాట్లు	2005
ఆర్‌టిపిపి-2	420 మెగావాట్లు	2007
బిఎస్ఇఎస్	220 మెగావాట్లు	2002
కోనసీమ	445 మెగావాట్లు	2004
వేమగిరి	370 మెగావాట్లు	2005
గౌతమి	464 మెగావాట్లు	2005
జివికె ఇండస్ట్రీస్	220 మెగావాట్లు	2005

1000 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల ఎన్‌టిపిసి సింహాద్రి, 220 మెగావాట్ల సామర్థ్యంగల గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పాదన కేంద్రం బిఎస్ఇఎస్ - యిప్పటికే గ్రిడ్ భవిష్యత్ డిమాండు అంచనాల్లో జోడించడం జరిగింది. మరో రెండేళ్ళలో 1450 మెగావాట్ల సామర్థ్యం గల గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పాదనలు గ్రిడ్ అంచనాల్లో చోటు చేసుకోనున్నాయి.

ఈ విశ్లేషణల మేరకు గోదావరి ఎత్తిపోతల పథక నిర్వహణకు అవసరమయ్యే విద్యుత్‌ను అదనపు ఉత్పాదనా పథకాల అవసరం లేకుండానే నిర్వహించవచ్చని అవగతమౌతుంది. అలాగని జలవిద్యుత్ కేంద్రాలను చేపట్టేవద్దని కాదు. ప్రభుత్వం యోచిస్తున్నట్టు సింగారెడ్డిపల్లె వద్ద, దుమ్ముగూడెం వద్ద జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించవల్సిందే. అయితే, ఈ జలవిద్యుత్ ఉత్పాదనా కేంద్రాలు పూర్తయ్యేవరకూ వేచివుండక, గోదావరి ఎత్తిపోతలను రాష్ట్ర విద్యుత్ గ్రిడ్ నుండి

విద్యుత్‌ని వినియోగించుకుని ప్రారంభించి, కాలక్రమేణా ప్రతిపాదిత జలవిద్యుత్ ఉత్పాదనా కేంద్రాలను పూర్తిచేసుకుని వీటి విద్యుత్‌ను వినియోగించుకోవాల్సి ఉంది.

విద్యుత్ కొనుగోళ్ళ వ్యయం

ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా (హెచ్.టి) హైటెన్షన్ కేటగిరీకి వస్తుంది. 2003-04 ఆర్థిక సంవత్సర టారిఫ్ మేరకు, 208 పైసలు యూనిట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ బావుల విద్యుత్ సరఫరా చెల్లింపులకన్నా ఈ చెల్లింపులు 4 నుంచి పదిరెట్లు అదనం. ఈ తేడాలో ఔచిత్యం ఏంటంటే, వ్యవసాయ బావుల నిర్మాణానికి ప్రాథమికంగా కొంత మొత్తాన్ని వెచ్చించాల్సి ఉంటుంది కదా. అదే ఎత్తిపోతల పథకాల్లో అయితే మొత్తం వ్యయమంతా ప్రభుత్వమే భరిస్తుంది.

ఈ రెండు తరహాల సేద్యవిధానంలో ఎకరా సేద్యానికి ఏ మేరకు విద్యుత్ వ్యయం అవుతుందో గమనిద్దాం.

తీరు	విద్యుత్ వినియోగం మిలియన్ యూనిట్లలో	సేద్యమైన భూవిస్తీర్ణం (ఎకరాల్లో)	ఎకరాకు అవసరమైన విద్యుత్ (యూనిట్లలో)	యూనిట్‌కు 2.08రూ॥ విద్యుత్ వ్యయం	యూనిట్‌కు 50పై. రూ. విద్యుత్ వ్యయం
250 మీ. ఎత్తుకు నీరును పంపేందుకు	1,000	5,00,000	2,000	4,160	1,000
427 మీ. ఎత్తుకు	1,650	5,00,000	3,300	6,864	1,650
వ్యవసాయ బావుల సేద్యం	1,000	6,77,000	1,477	3,027	739

పై పట్టికలో ధర్మసాగరం, కంతాలపల్లిలకు ఎత్తిపోతల విధానం ద్వారా ఎక్కువ విద్యుత్ వినియోగం అధిక వ్యయంతో కూడుకున్నదని వ్యక్తమౌతుంది. వ్యవసాయ బావుల ద్వారా సేద్యంతో సరిపోల్చినపుడు ఎకరాకు 739 రూ. చెల్లిస్తున్న రైతాంగం ఎత్తిపోతల విధానంలో ఎకరాకు 4,160రూ. నుండి 6,864 రూ. వరకూ చెల్లించాల్సి ఉంటుంది. 427 మీటర్ల ఎత్తుఉన్న రైతు ఎత్తిపోతల విధానం ద్వారా చెల్లించాల్సిన మొత్తం వ్యవసాయ బావులు వినియోగించే రైతు చెల్లిస్తున్న దానికంటే సుమారు తొమ్మిది/పది రెట్లు అదనం (739రూ. - 6,864 రూ.)

కొత్త టారిఫ్ విధానం

1998 నాటి విద్యుత్ సంస్కరణల చట్టం ప్రకారం నూతన సుంకాల విధానం అవసరం అయింది. పాత విధానాల మేరకు వినియోగదారుడి ఆర్థిక స్థోమతను పరిగణనలోనికి తీసుకొనేవారు ప్రజాసంక్షేమ లక్ష్యంగా ఆర్థిక వెనుకుబాటు వర్గాలకు సరఫరా వ్యయానికన్నా తక్కువకే విద్యుత్ సరఫరాను అందించి, ఈ వ్యయభారాన్ని ఉన్నత వర్గాల సుంకాల నుండి రాబట్టుకోవడం ఒక పద్ధతి కాగా, రెండో పద్ధతిగా ప్రభుత్వమే అదనపు రాయితీలను భరించేది. కానీ సంస్కరణలు రంగప్రవేశం చేసిన తదనంతరం ప్రభుత్వ రాయితీలను తగ్గిస్తూ, కాలక్రమేణా విరమించుకోవాలని నిర్దేశిస్తుంది. అంతిమ లక్ష్యంగా సేవలు చెల్లింపులకు మాత్రమేనని (కాస్ట్ టు సర్వే) చెల్లించగలిగే వారికే సేవలు అని అర్థం. ఇక చెల్లించుకోలేని వారికి యింతే సంగతులు, పోతే కీలక వ్యవసాయ రంగానికొచ్చేసరికి ప్రాథమికంగా యూనిట్‌కు 50 పైసలు చెప్పున సుంకాన్ని వసూలు చేస్తూ, మూడేళ్ళనాటికి సరఫరా వ్యయానికి సగాన్ని పొందేటట్టుగా పెంచాల్సివుందని ప్రపంచబ్యాంకు ఆదేశించింది.

ప్రపంచబ్యాంకు పథక ఆమోదిత పత్రం (Project Appraisal Document) 1999 జనవరిలో 4,250 కోట్ల రుణం రాష్ట్ర విద్యుత్ రంగ పునర్నిర్మాణ పథకం కింద అమోదించేటప్పుడు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. అంచెలంచెల షరతులతో కూడుకున్న ఈ రుణంలో ప్రధాన షరతు సంవత్సరానికి 12 నుండి 15 శాతం సుంకం పెంపుదల. మూడు సంవత్సరాల్లో వినిమయ సుంకం, సరఫరా వ్యయంలో 50 శాతం తగ్గే విధంగా... హితేన్ భయ్యా కమిటీ ఉత్పత్తి వ్యయాలను రాబట్టుకునే విధంగా సుంక నిర్ధారణ సూచిస్తే, ముఖ్యమంత్రుల సదస్సు యూనిట్‌కు 50 పైసల సుంకాన్ని నిర్దేశించింది.

ప్రపంచబ్యాంకు షరతులకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం జూన్ 14, 1997న ఓ ప్రభుత్వ ఉత్తర్వును జారీచేసింది. ప్రైవేటు యాజమాన్య ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడులకు బడ్జెట్‌పరమైన సమర్థన, వ్యయ ఆధారిత సుంకం (కాస్ట్ బేస్డ్ టారిఫ్) తదితర అంశాలన్నీ విద్యుత్ విధాన రూపకల్పనలో చోటుచేసుకున్నాయి. తదనంతరం రాష్ట్ర విద్యుత్ సంస్కరణల చట్టం 1998 ఏప్రిల్ 27న సభలో ప్రవేశపెట్టి ఒక్క రోజులోనే రాష్ట్ర శాసనసభ ఆమోదాన్ని ఏప్రిల్ 28న పొందింది. ఫిబ్రవరి 1, 1999 నుండి అమలులోకి వస్తున్నట్టుగా అక్టోబర్ 29, 1998న ప్రకటించబడింది. చట్ట ప్రధాన లక్ష్యాలుగా ఉత్పత్తి నియంత్రణ, పంపిణీ, సరఫరా రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యం ప్రధానాంశాలు. సుంక నిర్దేశితా అధికారాలను రెగ్యులేటరీ కమీషన్‌కు ఆపాదించడమైనది. సరఫరా, వినిమయాల కనుగుణంగా సుంకనిర్దేశన ప్రధాన లక్ష్యంగా కమీషన్ ప్రకటించింది.

ఫిబ్రవరి 2002న విద్యుత్ నియంత్రణా మండలి రూపొందించిన దీర్ఘకాలిక సుంక ప్రణాళికలోనూ, అంతిమంగా మార్చ్ 2003లో విడుదల చేసిన ఉత్తర్వులోనూ ఒకటే లక్ష్యం, రాయితీలను నియంత్రించడానికి సరఫరా వ్యయానికి తగ్గ సుంకాన్ని వసూళ్ళు చేయాలన్నదే. జూన్ 2003లో కేంద్రం సవరించిన విద్యుత్ చట్టం 2003 లక్ష్యం కూడా యిదే.

సుంకం - వినిమయ వర్గరీత్యా విశ్లేషణ

2000 నుండి 2004 వరకూ విద్యుత్ వినియోగదార్లను 4 వర్గాలుగా విభజించారు. 0 నుండి 50 యూనిట్ల వరకూ నెలసరి వినియోగదార్లను ఒక వర్గంగానూ (గృహ వినియోగదార్లగానూ) 100 నుండి 200 యూనిట్ల మేరకు నెలసరి వినిమయం చేసే వారిని వాణిజ్య వినియోగదార్లగానూ... కరువు పీడిత ప్రాంతంలో 3 నుండి 5 హార్స్‌పవర్‌గల వ్యవసాయ పంపుసెట్ల వినియోగదార్లను మూడోవర్గం గానూ, కాగా నెలసరి 2 లక్షల యూనిట్లకు పైగా వినిమయం చేసేవారిని పారిశ్రామిక వినియోగదార్లుగా విభజించారు. గత నాలుగేళ్ళ విద్యుత్ వినిమయాన్ని 2000 సంవత్సరపు వినిమయ పునాదిగా విశ్లేషిస్తూ 0-50 యూనిట్లలోపు గృహవినియోగదార్ల వినిమయం 81 శాతం పెరగ్గా, వాణిజ్య-పారిశ్రామిక సంపన్నవర్గాల వినిమయం ఒక శాతం మాత్రమే పెరిగింది. అంటే, ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల ప్రభావం ప్రధానం గురిచేసింది బడుగువర్గాల వినియోగదార్లనే.

అలాగే 1999 నుండి 2004 వరకూ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో విద్యుత్ పంపిణీ 25 శాతం పెరగ్గా, ఆదాయం మాత్రం 71 శాతం మేరకు పెరిగింది. యిందుకు వాణిజ్య సంపన్నవర్గాల సుంకాల్లోనే తగ్గుదలలు ప్రతిపాదింపబడి ప్రయోజనాలను పొందారు.

పెరిగిన విద్యుత్ కొనుగోలు ధరలు

విద్యుత్ ఉత్పాదన - పెరిగిన విద్యుత్ ఉత్పాదన విలువలు

1998-99 నుండి 2003-04 నాటికి విద్యుత్ ఉత్పాదన 24.2% పెరగ్గా ట్రాన్స్‌కో కొనుగోలు 25% పెరిగింది. యిదేకాలంలో ట్రాన్స్‌కో కొనుగోలు ధరలు 71.5 శాతం మేరకు పెరగ్గా యూనిట్ ధర 37.7 శాతం పెరిగింది. సంస్కరణల పుణ్యమా అని రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన 1998-99లో 81.2 శాతం మేరకు, 2003-04తో 65.58 శాతం మేరకు తగ్గిపోతే, ప్రైవేటు విద్యుత్ ఉత్పాదనా శాతం 6.62 నుండి 12.29 మేరకు పెరిగింది. ప్రైవేటు విద్యుత్ ఉత్పాదనా సామర్థ్యం 130 శాతం మేరకు పెరిగింది యిదే కాలంలో.

జెన్‌కో విద్యుత్ సరఫరా 67 శాతం నుండి 56.28 శాతానికి తగ్గిపోగా, ప్రైవేటు విద్యుత్ ఉత్పాదనా సంస్థల సరఫరా 11 శాతం నుండి 17.34 శాతానికి పెరిగింది.

ఈ నేపథ్యంలో, పెరుగుతున్న విద్యుత్ వినిమయ వ్యయాన్ని ఎవరు భరిస్తారు? ప్రభుత్వం ఏమైనా రాయితీలనిచ్చి ఆదుకుంటుందా? లేక విధానాలను శాసిస్తున్న సంస్కరణలు భరిస్తాయా? ఈ రెండూ కావు... యిందుకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం రూపొందిస్తూ వస్తున్న నీటి వినియోగదార్ల సంఘాలు (Water Usages Association. WVA) ఈ ప్రాజెక్టు నిర్వహణను చేపట్టి, మొత్తం భారాన్ని వినియోగదార్లైన రైతాంగం నెత్తిన మోదేందుకే ఈ పన్నాగం అంతా తనది కాకపోతే... తాటిపట్టెకు ఎదురుదేకమన్నట్టు' అంతిమంగా రైతాంగాన్ని బలిచేయడానికే ఈ పథకం.

విద్యుత్ వనరు	అందుబాటులోకి వచ్చిన సామర్థ్యం మెగావాట్స్		కొనుగోలు చేసిన యూనిట్స్ (ఎం.యు)		మొత్తం వ్యయం (కోట్లలో)		యూనిట్ ధర రూపాయల్లో	
	1998-99	2003-04	1998-99	2003-04	1998-99	2003-04	1998-99	2003-04
1. ఎపిజెన్‌కో	5,910	5,927	25,127	26,369	2,925	4,201	1.16	1.59
2. ఎపిపి	482	1,111	4,128	8,125	824	1,977	2.00	2.43
3. ఇతరములు	885	2,000	8,237	12,359	1,141	2,208	1.38	1.79
4. మొత్తం	7,277	9,038	37,492	46,853	4,890	8,386	1.30	1.79

ఐపిపి: మెగా మినీ ప్రాజెక్టులు ప్రైవేటు ఆధ్వర్యంలో యితరములు కేంద్ర విద్యుత్ ఉత్పాదనా కేంద్రాలు, యితర రాష్ట్ర విద్యుత్ సంస్థలు

వ్యవసాయ రంగంలో విద్యుత్ వినిమయం గురించి వచ్చే సంచికలో...

(సంక్షిప్తానువాదం- విద్యాభూషణ్)

"నాలుగు సీట్లకోసం జాతీయ పార్టీ కాంగ్రెస్ చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకుంది" చంద్రబాబు

– బిజెపి జాతీయ పార్టీ 20 చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోలేదా? తె.దేశం ఆ బిజెపితో అంటకాగటం లేదా?

"నక్సల్ రాజ్యమా? ప్రజాశ్రేయో రాజ్యమా" సి.ఎం.

– ఆ ప్రజాశ్రేయోరాజ్య కోసం ఎదురుచూసి చూసి కళ్లు కాయలు కాచిపోతున్నాయి.

"ట్రాక్టర్ బోల్తా, నలుగురి మృతి" వార్త

– రాష్ట్రం ప్రమాదాలాంధ్రప్రదేశ్ అయిపోయింది.

"ప్రజాస్వామ్యం ద్వారానే ఇండియాలో పాలించటం సాధ్యమన్న విషయాన్ని ప్రపంచానికి చాటడంలో పాలకులు విఫలమయ్యారు" సి.బి.ఐ. మాజీ డైరెక్టర్ జోగిందర్‌సింగ్

– మా బాగా చెప్పారు.

"సరళీకరణ ఫలితాలు ప్రస్ఫుటం" – అరుణ్‌శౌరి

– కరెక్ట్. నిరుద్యోగం, నీళ్లకరువు, రుణబారం అన్నీ ప్రస్ఫుటం.

"ప్రైవేటీకరణలాంటి ముఖ్యవిషయాల్లో ఎన్‌డిఎ విధానాలను కాంగ్రెస్ ప్రణాళిక బలపరుస్తోంది" ఎకనామిక్ టైమ్

– కాదు 1991లో కాంగ్రెస్ సంస్కరణలను ప్రారంభిస్తే బిజెపి వాటిని కొనసాగిస్తుంది.

"భారతదేశంలో 2020నాటికి అంతామంచిగా ఉంటుంది"–అద్వానీ

– అదేమిటి, వెలుగుతోందన్నారుగా

"అధికారమే కె.సి.ఆర్. లక్ష్యం" తెలుగుదేశం పుస్తకం

– ఏం, మీరు సర్వసంగ అధికార పరిత్యాగులా ?

"అభివృద్ధి కనిపించలేదంటే ధృతరాష్ట్రులుగా మారినట్లే"– నాగం సోమినేని

– లేని అభివృద్ధి కనిపించిందంటే, కళ్లడాక్టరును సంప్రదిస్తే మంచిది.

"కిలో టమాటా 25 పైసలు" వార్త

– అయినా వినియోగదారునికి కిలో నాలుగుకు తగ్గడం లేదు.

"ఆర్థిక పరిస్థితిని దూరదృష్టితో పరిశీలించాలి" శౌరి

– అవును, తక్షణ భవిష్యత్‌లో ప్రజలకు ఏమీ ఇవ్వలేరు కాబట్టి

"డాలర్‌కు 45 రూపాయల హద్దు దాటింది" వార్త

– పిల్లికి చెలగాటం, ఎలక్కు ప్రాణసంకటం

"ఎన్‌డిఎ పాలనలో ఏడాదికి 84 లక్షల ఉద్యోగాలు" ప్రణాళిక సంఘం

"ఎన్‌డిఎ పాలనలో 170 లక్షలు (ఏడాదికి 34ల)–కొట్టాయంలో అద్వాని

– ఏది సత్యం, రిటైల్‌గానైతే ఎక్కువ, హోల్‌సేల్‌గానైతే తక్కువ అన్నట్లుంది!

"తిన్నది అరగకే రైతుల ఆత్మహత్యలు" – కేంద్రమంత్రి దత్తాత్రేయ

"చస్తే ప్రభుత్వం ఇచ్చే డబ్బుకోసం ఆత్మహత్యలు చేసుకొంటున్నారు" మంత్రి నాగం

– తిన్నదరగక మాట్లాడే మాటలు ఇలాగే ఉంటాయ్!

"రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు నిర్మించటం వల్లనే సోనియా రోడ్‌షోలు సాధ్యమయ్యాయి" ఎర్రంనాయుడు

– నా కోడికూయందే తెల్లారదని ముసలమ్మ అన్నట్లుంది

"కర్నాటకలో ఆత్మహత్యల గురించి సోనియా మాట్లాడలేదు" ఎర్రంనాయుడు

– దేశంలోనే ఆత్యహత్యల్లో ఆంధ్ర ఫస్ట్‌కదా. కర్నాటక ఇంకా చాలా దూరంలో వుంది.

"మా పాలనలో విద్యుత్ స్థాపితశక్తి 5వేల మె.వా. నుంచి 10వేల మె.వా.కు పెంచాం"– ముఖ్యమంత్రి

– అదే వాస్తవమైతే, రోజుకు రెండు కోట్లు ఖర్చుపెట్టి విద్యుచ్ఛక్తి కొనుగోలు చేయాల్సిన అవసరమేమిటో?

"కాంగ్రెస్‌వారు తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టారు" ముఖ్యమంత్రి

– వాళ్లు చాలా నయం. తెలుగుదేశం రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకే అమ్మేశారు కదా!

వినదగు నెవ్వరు చెప్పిన...

రాజకీయ నాయకులను బెదిరించే నక్సలైట్ల ప్రకటనలను పత్రికలు ప్రచురించకూడదన్న ఎన్నికల ప్రధాన అధికారి వ్యాఖ్యలు పత్రికా స్వాతంత్ర్యాన్ని, సంపాదకీయ స్వేచ్ఛను హరించేవిగా ఉన్నాయి.

– దేవులపల్లి అమర్ (ఎపియుడబ్ల్యుజె)

బడ్జెట్‌లో కేటాయించకుండా, ముందస్తు అనుమతి లేకుండా ఏ ప్రభుత్వమైనా ఎన్నికలకు ముందు సంక్షేమ పథకాలను ప్రకటించడం ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనే అవుతుంది.

– టి.ఎస్. కృష్ణమూర్తి

పాలకుల ధనబలం– దౌర్జన్యబలం, దోపిడీబలంతో పాటు పోలీసుల బలం తోడుగా ఓట్లను దోచుకుంటున్నారు.

– గద్దర్

ఎన్డీయే కూటమిలోనూ, కూటమి ప్రభుత్వంలోనూ కూర్చున్న వారికి నిరుద్యోగం, పేదరికం వంటివి సమస్యలేకావు. ఈ రెండు సామాజిక మహమ్మారుల్లా పెరిగిపోతున్నా వీరు అంతా బాగుందని అనుకోగలుగుతున్నారు.

– వి.పి. సింగ్ (మాజీ ప్రధాని)

పదవులు చేపట్టడానికి విదేశీ అనే అంశం ప్రధానం కాదు. చిత్తశుద్ధిని మాత్రమే అర్హతగా పరిగణించాలి.

– జె.ఎం. లింగ్డో
(మాజీ ఎన్నికల అధికారి)

ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాల్లో గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న 1898నాటి "నేర శిక్షాస్మృతి"ని తక్షణం రద్దుచేయాలి. ఆ చట్టం కారణంగా అనేక మంది ఖైదీలు శిక్షాకాలం ముగిసినా జైళ్లలోనే మగ్గుతున్నారు. 1898ని రద్దుచేసి 1973 "నేర శిక్షాస్మృతి"ని అమలు చేయనట్లయితే మేమే ఆ పనిచేస్తాం"

– సుప్రీం

భారత్ వెలిగిపోతుందన్న భాజపా ప్రచారం నూతిలో కప్పవాదం వంటివే తప్ప విస్తృతానుభవంతో చెబుతున్న వాస్తవం కాదు"

– స్వదేశీ జాగరణ్ మంచ్ (సంఘ్ పరివార్ ఆర్థిక విభాగం)

చిన్నపిల్లలు, మహిళల జోలికి నక్సల్స్ రానేరారు. కేవలం నక్సలైట్లు అంటే గిట్టనివారు చేస్తున్న ప్రచారంలో భాగంగానే ఇలాంటి ప్రకటనలు వెలువడతున్నాయి.

– సినీ నటి రోజా

లేఖా 'వీక్షణం'

చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాలి

మార్చి 1-15 సంచికలో బాబాలు - మీడియా అనే వ్యాసంలో రచయిత జి.ఎస్.రామ్మోహన్ పై అంశం పై పని చేసే మీడియాలోని జర్నలిస్టులపై చాలా చిన్న చూపు కనపరిచారు. ఎక్కడా వారు వెలుగులోకి తెచ్చిన బురిడీలను మెచ్చుకోలు బదులు చాలా లాజిక్‌గా కొట్టిపారేటయంలో ఉత్సాహం కనబరిచారు. ఏ అంశం అయినా ముదరక ముందర కొన్ని అవకాశాలు ఆ సమస్య నుండి బయటపడటానకి ఉంటాయి. పెరిగి పెద్దదిగా మారాక వాటిలోని మంచికి చెడుకూ సంబంధమే లేకుండా సాధికారత వస్తుంది. పుట్టపర్తి బాబా విషయం ఇందుకు మంచి ఉదాహరణ. ఆయన కృపకోసం రాష్ట్రపతులు వచ్చేదాకా ఎదగటం అనేది ఒక్కసారిగా జరిగింది కాదు. ఎన్నో ఏళ్ళు కొనసాగిన అతడి విధానాల ఫలితం. చెయ్యటానికి అవకాశాలు వున్నా, అనేక వాస్తవాలు బయట పెట్టినా వాటిని ప్రజలు అంతగా విశ్వసించటం లేదు. అందువలన చిన్నపాముకైనా పెద్ద కర్రను వాడాల్సిందే. సమాజం మరింత మంది బురిడీగాళ్ళ చేతుల్లో పడకుండా ఉండాలంటే మీడియా ఇవాళ చేస్తున్న పనిని మరింతగా చెయ్యాలి. రచయిత తన వ్యాసంలో ఈ అవసరాన్ని గుర్తించకపోవటం విచారం.

– సజ్జా వెంకటేశ్వర్లు,
వేటపాలెం, ప్రకాశం జిల్లా

పార్టీలకూ, అభ్యర్థులకూ ముఖ్యమైనొక్క ప్రశ్నలు

ఎన్నికలను అర్థరహితం చేయడానికి ఏమేం చేయాలో అంతా చేసేసి అన్ని పార్టీలూ కలిసి ఎన్నికలు జరుపుకుందాం రమ్మంటున్నాయి. మీడియా కూడా వారికి సహకరిస్తూ ఏ నాయకుడు ఏ పార్టీ నుంచి ఏ పార్టీకి ఫిరాయిస్తున్నాడన్నదే ప్రధాన వార్తగా వ్యవహరిస్తున్నది. పొత్తులు, ఎత్తులు తప్ప ఎన్నికల గురించి రాయడానికేమీ లేనట్టు ప్రవర్తిస్తున్నది. సత్యం చెప్పడం కార్టూనిస్టుల వంతయింది.

ఎంత తిట్టుతున్నా విసుక్కున్నా ప్రభుత్వాలనూ, ప్రభుత్వ విధానాలనూ నిర్ణయించడంలో ఎన్నికలకొక పాత్ర ఉంది. కాబట్టి తిట్టుకొని కూర్చోవడం తగదు. ఎన్నికల రంగంలో ఉన్న అన్ని పార్టీలనూ, అభ్యర్థులనూ మనం ప్రధానం అనుకునే సమస్యలకు నిర్దిష్టమైన జవాబులు చెప్పమనీ, వాటికి వారి మేనిఫెస్టోలో చోటు కల్పించి ఎన్నికలకు దిగమనీ డిమాండ్ చేయాలి. ఇక్కడ 'నిర్దిష్టం' అనేది అతి ముఖ్యమైన పదం. ఊరికే వీరికి మేలు చేస్తావా, వారికి మేలు చేస్తావా అంటే చేసేస్తాం అంటారు. మానవహక్కులను కాపాడతావా అంటే కాపాడేస్తాం అంటారు. వివాదంలో ఉన్న అంశాలపైన నిర్దిష్టమైన జవాబు కోరాలి. ఆ జవాబును బహిరంగంగా ప్రకటించి ఎన్నికలకు దిగమని డిమాండ్ చేయాలి. తెలంగాణ ఉద్యమకారులు ప్రత్యేక తెలంగాణ గురించి మీ వైఖరేమిటో స్పష్టంచేసి ఎన్నికలలోకి దిగమని ఏ విధంగానయితే అడుగుతున్నారో, ఆ విధంగానే ఒక్కొక్క ప్రజావర్గం తన సమస్యల గురించి అడగాలి.

మేము మానవహక్కుల కోణం నుండి కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు అభ్యర్థుల ముందు ఉంచదలచుకున్నాం. ఇవి తప్ప మానవహక్కుల గురించి అడగవలసినదేవీ లేవని కాదు. ఇంకా చాలా ఉన్నాయి. కానీ ప్రస్తుతం చర్చలో ఉన్న విషయాలను దృష్టిలో ఉంచుకొని ఒక్కొక్క రంగానికి సంబంధించి ఒకటి రెండు ముఖ్యమైన ప్రశ్నలు పార్టీలనూ, అభ్యర్థులనూ అడగదలచుకున్నాం. సూటిగా జవాబుచెప్పి ఎన్నికలకు దిగమని డిమాండ్ చేస్తున్నాం.

ఈసారైనా నీళ్ల సమస్యను పరిష్కరిస్తారా?

1. కరువు సమస్యకు సాగునీటి కల్పన ప్రధాన పరిష్కారం అని గుర్తిస్తారా? అన్ని ప్రాంతాల రైతులకూ సాగునీటిజీజీ ఒకే వెలకు పొందే హక్కు ఉండాలని అంగీకరిస్తారా? ఈ రెండు విషయాలనూ గుర్తించి, సాగునీటి కల్పనకు ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలో మొదటి ప్రాధాన్యం ఇచ్చి విద్యుదుత్పత్తి, సరఫరా, భూగర్భ జలాల పెంపుదల, చెరువుల మరమ్మతు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం తదనుగుణంగా చేపడతారా?
2. రాష్ట్రం వాటాకు వచ్చిన కృష్ణా నదీ జలాలను న్యాయబద్ధంగా పునఃపంపిణీ చేసి, అన్ని అనుమతులూ ఉన్న బీమా ప్రాజెక్టుతో మొదలుపెట్టి తెలంగాణా, రాయలసీమలలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులనూ నిర్దిష్టకాలంలో పూర్తిచేస్తారా?
3. గోదావరి జలాలపైన తెలంగాణకు మొదటి హక్కుందని గుర్తించాలి. మాటల గారడీలు మానేసి దాని వినియోగానికి సమగ్రమైన ప్రణాళికా రచన చేసి ప్రాజెక్టులను నిర్దిష్ట కాలంలో పూర్తిచేయాలి. చేస్తారా?
4. ప్రాజెక్టుల (అది నీటిపారుదల ప్రాజెక్టుగానీ, విమానాశ్రయం గానీ, భారీ పరిశ్రమగానీ) వల్ల నిర్వాసితులయ్యే ప్రజల పునరావాసం విషయంలో ప్రస్తుతం అమలులో ఉన్న ద్వంద్వ విధానాన్ని విడనాడాలి. ప్రపంచ బ్యాంకు నిధులు కల్పించే ప్రాజెక్టులలో నిర్వాసితులకు చెప్పుకోదగ్గ మోతాదులో పునరావాసం కల్పిస్తున్నారు. ఇతర ప్రాజెక్టుల నిర్వాసితులకు ఏ పునరావాసమూ లేదు. నిధుల ఎవరిచ్చినా నిర్వాసితుల సమస్యలొక్కటేనని గుర్తించి అందరికీ ఒకేరకమైన సమగ్రమైన పునరావాసం కల్పించాలి. దీనికి ఒప్పుకుంటారా?

ఈ రిజర్వేషన్లన్నీ ఇస్తారా?

5. ప్రభుత్వరంగం మాదిరిగానే ప్రైవేట్ రంగంలోనూ ఎస్.సి., ఎస్.టి., బి.సి.లకూ స్త్రీలకూ విద్యా, ఉద్యోగరంగాలలో రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని చేయాలి. ప్రపంచ బ్యాంకు, బహుళజాతి సంస్థలు కాదన్నా దానిని అమలుచేయాలి. చేస్తారా?
6. చట్టసభలలో స్త్రీలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి అన్ని పార్టీలూ సిద్ధమేనంటూ, రాజ్యాంగ సవరణ మాత్రం జరగనీయకుండా అందరూ కలిసి ఆడుతున్న ప్రహసనాన్ని చూసి ప్రజలు విసిగిపోయారు. ఎన్నికల తరువాత ఆరునెలల తిరిగే లోపల ఎవరిమీద ఎవరూ నెపం పెట్టి తప్పించుకోకుండా రాజ్యాంగ సవరణ చేస్తారా?
7. రాష్ట్రంలో ఉద్యోగాలలో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ నియమాలు అమలుకావడం లేదని గుర్తించి వాటిని సక్రమంగా అమలు చేయడం కోసం 1986లో జారీ అయిన జివో 610 పద్దెనిమిది సంవత్సరాలుగా అమలు కాకుండా ఉంది. దాని అమలు కోసం నియమించిన గిర్‌గ్లాని కమిషన్ సూచనలు కూడా అమలుకు నోచుకోలేదు. అధికారానికి వస్తే ఆరునెలల గడువులోపల వీటిని సమగ్రంగా అమలు చేస్తామని హామీ ఇస్తారా?
8. వికలాంగులకు అన్ని ఉద్యోగాలలోనూ విద్యాసంస్థలలోనూ మూడుశాతం రిజర్వేషన్ కల్పించాలని చెప్పే చట్టపరమైన నియమం ఎక్కడా సక్రమంగా అమలు కావడంలేదు. ఆ చట్టం

చేసిన 1996 సంవత్సరంతో మొదలుపెట్టి బ్యాక్‌లాగ్‌ను గుర్తించి ఆ రిజర్వేషన్ అమలు చేయాలి. దానిని ప్రైవేట్ రంగానికి కూడా విస్తరింపజేసే చట్టసవరణ చేపట్టాలి. చేస్తారా?

9. జనాభాలో ముస్లింల వాటాకూ, విద్యా ఉద్యోగ రంగాలలో వారి వాటాకూ మధ్య హస్తిమశకాంతరం ఉంది. విద్యా, ఉద్యోగ రంగాలలోనూ, స్థానిక సంస్థలలోనూ ఎస్.సి., ఎస్.టి., బి.సి.లకు ఇస్తున్న రిజర్వేషన్లు ముస్లింలకు కూడా ఇవ్వాలి. దీనికి అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలి. చేస్తారా? అలాగే దళిత బౌద్ధులలాగ దళిత క్రైస్తవులను కూడా ఎస్‌సి జాబితాలో చేర్చాలి. దీనికి పార్లమెంటు చట్టం చేయాలి. చేస్తారా?

పున్నయ్యగారి సూచనల మాటేమిటి?

10. ఎస్.సి., ఎస్.టి., (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని బలహీనపరుస్తూ మన రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులనూ అధిగమించడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ ముందు హాజరైన దళిత, ప్రజాతంత్ర సంఘాలు చేసిన సూచనలు ఆ కమిషన్ రికార్డులలో పదిలంగా ఉన్నాయి. వాటిని వెలికితీసి ఆ సూచనలననుసరించి ఆ చట్టాన్ని సవరించాలి. ఆ పని చేస్తారా?

11. కుటుంబ హింసను నేరంగా ప్రకటించే ఐపిసి సెక్షన్ 498-ఎని మన రాష్ట్ర అసెంబ్లీ ఈ మధ్యనే సవరించింది. ముద్దాయిలు బాధితురాలిని 'రాజీ'కి ఒప్పించి, నేరం రుజువైనా శిక్షపడకుండా తప్పించుకునే అవకాశం కల్పించింది. ఈ చట్టసవరణను రద్దుచేసి వెనుకటి స్థితిని పునరుద్ధరించాలి. ఆ పనిచేస్తారా? సామాజిక అసమానతల నుంచి పుట్టిన నేరాలను అదుపు చేయడం కోసం రూపొందించిన నేరవిచారణ ప్రక్రియలో 'రాజీ'కి చోటు కల్పించడానికి వీలులేదని అంగీకరిస్తారా?

ఆదివాసుల పొట్ట కొట్టమని హామీ ఇస్తారా?

12. రిజర్వ్ అడవులలోని 'చొరబాటు'దార్లందరినీ వెంటనే తొలగించాలంటూ కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ 2002 మే నెలలో జారీ చేసిన ఆదేశాలను, ఆదివాసులు, ఇతర భూమిలేని పేదలపైన అమలు చేయకూడదు. ఆ అదేశాలను ఆ మేరకు సవరించాలి. కేంద్ర ప్రభుత్వం సవరించినా, లేకున్నా ఆ ప్రజలపైన దానిని ప్రయోగించబోమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా తెలపాలి. ఆ పని చేస్తారా?

13. ఏజెన్సీ ఆదివాసీలు భూముల బదలాయింపును నిషేధించే 'వన్ ఆఫ్ సెవన్టీ' నియమాలను సక్రమంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 1998లో పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు నుద్దేశించి ఒక సర్క్యులర్ జారీచేసింది. అది ఆ జిల్లాల్లో ఒకే ఒక్క ఏజెన్సీ గ్రామంలో – అది కూడా కొంతమేరకు మాత్రమే – అమలైంది. దానిని రాష్ట్రమంతటా అన్ని ఏజెన్సీ గ్రామాలలోనూ నిర్దిష్టమైన గడువు లోపల సమగ్రంగా అమలు చేయాలి.

ఎన్‌కౌంటర్లూ, పోటాలు ఆపుతారా?

14. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని, ఆదమరిచి ఉన్న వ్యక్తిని కాల్చిచంపే 'ఎన్‌కౌంటర్' విధానానికి పూర్తిగా స్వస్తి చెప్తారా? 'విచారణ జరిపి అది బూటకమని రుజువయితే శిక్షిస్తారా' అని మేము అడగడం లేదు. పోలీసుల దుశ్చర్యలకు వ్యతిరేకంగా విచారణలు జరగవు. పోలీసులు జరగనివ్వరు. ఎన్‌కౌంటర్‌లు పాలనా విధానంలో భాగంగా జరుగుతున్నాయన్న వాస్తవాన్ని బహిరంగంగా గుర్తించి, దానికి స్వస్తిచెప్తారా అని అడుతున్నాం.

15. పోటాచట్టం దుర్వినియోగాన్ని అరికడతామంటే చాలదు. పూర్తిగా రద్దుచేయాలి. రద్దయ్యేదాకా మన రాష్ట్రంలో దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయోగించకూడదు. అవే అవలక్షణాలున్న ఆంధ్రప్రదేశ్ సంఘటిత నేరాల చట్టాన్ని కూడా రద్దుచేయాలి. ఈ పనులు చేస్తారా?

16. అక్రమ నిర్బంధాన్నీ కస్టడీలో చిత్రహింసలూ నివారించడం కోసం, అరెస్టు చేసేటప్పుడూ, ఇంటరాగేషన్ చేసేటప్పుడూ పోలీసులు అనుసరించవలసిన పద్ధతి గురించి సుప్రీంకోర్టు 'డి.కె.బసు' కేసులో 1997లో జారీచేసిన మార్గదర్శక సూత్రాలకు చట్టం రూపం ఇవ్వాలి. ఇస్తారా?

17. పీపుల్స్‌వార్ పైన పెట్టిన నిషేధాన్ని ఎత్తివేస్తారా? ఆ పార్టీని నిషేధించడం కోసం జారీచేసిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ చట్టాన్ని రద్దుచేస్తారా? నక్సలిజాన్ని ఒక రాజకీయ ఉద్యమంగా గుర్తించి దానితో రాజకీయంగా వ్యవహరిస్తారా?

కార్మికులను రోడ్డున పడేయకుండా ఉంటారా?

18. కార్మికుల హక్కులను బలహీనపరిచే ఏ చట్టమూ చేయకూడదు. పార్లమెంటు ఒకవేళ అటువంటి చట్టం చేస్తే దాని నుంచి మన రాష్ట్రాన్ని మినహాయించే చట్టాన్ని రాష్ట్ర అసెంబ్లీ చేయాలి. దానికి రాష్ట్రపతి ఆమోదం పొందడానికి కేంద్రంతో పోరాడాలి. సమ్మతమేనా?

19. స్త్రీ పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వని ప్రతి యజమానినీ 'సమాన వేతనాల చట్టం' కింద అరెస్టు చేసి శిక్షించాలి. ఆ పని చేస్తారా?

20. ప్రభుత్వరంగ సంస్థలను ఒకటొకటిగా వదిలించుకుంటామనీ, ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు సాలీనా తగ్గించుకుంటూ పోతామనీ గత ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుకు ఇచ్చిన హామీని రద్దుచేయాలి. ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించాలి. ఆ పనిచేస్తారా? ఈ విషయాలలో ప్రజా పాలనావసరాలు, ఉపాధి

కల్పన ప్రమాణాలు కావాలి తప్ప వేరే ఏదీ కాదు అని ఒప్పుకుంటారా?

21. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులలో మనుషులను నియమించ గల చోట యంత్రాలను నియమించకూడదు. ఉపాధి కల్పన అభివృద్ధి పనుల ప్రధాన లక్ష్యంగా ఉండాలి. ఒప్పుకుంటారా?

22. చేనేత రంగానికి కొంత కనీస భద్రత కల్పించే 1985 నాటి హాండ్లూమ్ రిజర్వేషన్ ఆర్డర్‌ను తు.చ. తప్పకుండా అమలు చేయాలి. ఆధునీకరణ పేరిట చేనేత రంగం గొంతు నులిమివేసే సత్యం కమిటీ సిఫారసులను తిరస్కరించాలి. నూలు, ధర, రంగుల ధర చేతి మగ్గాలకు అందుబాట్లో ఉంచాలి. కొనుగోలు మార్కెట్ కల్పించాలి. ఈ పనులు చేస్తారా?

టూరిజం పేరుతో పేదల్ని తరమకుండా ఉంటారా?

23. పట్టణాల సుందరీకరణ పేరిట పేదలను పట్టణాల నుంచి బయటకు పంపించకూడదు. వారికి వారు నివసిస్తున్న స్థలాలలోనే పట్టాలు ఇచ్చి వారి కాలనీలను నివాసయోగ్యం చేయడానికి అవసరమైన అన్ని వసతులూ కల్పించాలి. దీనికి ఒప్పుకుంటారా?

24. టూరిజం పేరిట తీర ప్రాంతంలో మత్స్యకారులను, ఏజెన్సీలో ఆదివాసులను వారి ఆవాసాల నుంచి తొలగించకూడదు. వారి పరిసరాలపైన వారికి ఉన్న హక్కులను కుదించకూడదు. ప్రకృతి మీద మొదటి హక్కు దానిని ఆధారం చేసుకొని బతికే ప్రజలదేనని ఒప్పుకోవాలి. ఒప్పుకుంటారా?

విద్యా వైద్యాలు మీ బాధ్యతని గుర్తిస్తారా?

25. రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ జారీచేసిన జివో 90ని రద్దుచేయాలి. ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వం బాధ్యత అని గుర్తించాలి. దీనికి సిద్ధమేనా?

26. విద్యారంగంలో కట్టలు తెగి ప్రవహిస్తున్న ప్రైవేటీకరణకు అడ్డుకట్ట వేసి, అన్ని స్థాయిలలోనూ విద్య ప్రజల హక్కు, ప్రభుత్వం బాధ్యత అని గుర్తిస్తారా?

విద్యుత్ లోపాలను సవరిస్తారా?

27. విద్యుత్ రంగంలో ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో చేసుకున్న అన్ని కొనుగోలు ఒప్పందాలనూ రద్దుచేయాలి. విద్యుత్తు అందుబాట్లో ఉండటం అతి పేదలకు సహితం ఒక హక్కు అని గుర్తించాలి. ఈ ప్రాతిపదికన విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను పునర్నిర్మించాలి. ఆ పని చేస్తారా?

దేవాలయ భూములు పేదలకు ఇప్పిస్తారా?

28. దేవాదాయ చట్టంలోని సెక్షన్ 82 రాజ్యాంగబద్ధమేనని సుప్రీం కోర్టు ప్రకటించిన కారణంగా, దాదాపు మూడున్నర లక్షల ఎకరాల భూమి ప్రభుత్వం చేతిలోకి వచ్చింది. అందులో ఒక లక్ష ఎకరాల దాకా ఆ చట్టం ప్రకారమే భూమిలేని పేదలకు దక్కుతుంది. తక్కిన రెండున్నర లక్షల ఎకరాలను కూడా భూమిలేని పేదలకు, అందునా ప్రధానంగా ఎస్.సి., ఎస్.టి.లకు చవకగా ఇవ్వాలి. అంతేతప్ప ఆదాయం కోసం ధనవంతులకు బహిరంగ వేలం ద్వారా అమ్మకూడదు. దీనికి ఒప్పుకుంటారా?

29. పారదర్శక పాలన గురించి ఊరికే ఊదరగొట్టడం మానేసి, దానికి సమగ్ర రూపం ఇచ్చే సమాచార హక్కును చట్టబద్ధం చేయాలి. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ఉన్న సమాచార హక్కు చట్టాలలోని లోపాలను తొలగించి మన రాష్ట్రంలోనూ చట్టం చేయాలి. ప్రత్యేకించి, పట్టణాలలోనైనా, గ్రామాలలోనైనా భూములకు సంబంధించిన సమాచారం ఒక హక్కుగా ప్రజలకు అందుబాట్లో ఉండాలి. ఆ పని చేస్తారా?

30. ముఖ్యమంత్రికి ఉత్సాహమనిపించినప్పుడల్లా ఒక కొత్త సంఘాన్ని పెట్టడం కాకుండా, రాజ్యాంగం గుర్తించిన స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు సరైన మార్గమని గుర్తిస్తారా? రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే, రాజ్యాంగంలోని 11, 12వ షెడ్యూళ్లననుసరించి స్థానిక సంస్థలకు అధికారాలు కల్పిస్తారా?

మత ద్వేషాన్ని అరికడతారా?

31. మనది చాలా భిన్నత్వం, వైవిధ్యం ఉన్న సమాజమని పాఠ్యపుస్తకాల్లో గొప్పలు చెప్పుకుంటూ, ఆచరణలో దానిని ధ్వంసం చేసేవారిని ఉపేక్షించే వైఖరిని మానుకుంటారా? హిందుత్వవాద సంస్థల వీధిరౌడీ చర్యలను అరికడతారా? ఇతర మతస్థుల పైన ద్వేషం కక్కడానికీ, హింసను రెచ్చగొట్టడానికీ ఎవరికీ హక్కులేనట్టే సంఘ పరివార్ సంస్థలకు కూడా లేదని గుర్తిస్తారా? అందరిలాగే వారిపైన కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటారా?

మానవ హక్కుల వేదిక

20 ఫిబ్రవరి, 2004

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ. 140/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.

వి.హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Owned, Printed and Published by **V.Hanumantha Rao** at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073. Ph: 23748672

Designed & Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. **Editor** : V.Hanumantha Rao